www.prajavinikidi.com

RNI.No :TELTEL/2023/85745

# ప్రజా వినికిడి

మా అక్షరం-మీ ఆయుధం

తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న

ప్రజా వినికిడి

తెలుగు దినపత్రిక నందు పనిచేయుటకు

జర్నలిజంపై ఆసక్తి కలిగిన విలేఖరులు కావలెను

ఆసక్తి గలవారు సంప్రదించండి

8978701613,7013016545

సంపుటి - 3 సంచిక -107 బుధవారం 16 జులై 2025 ఎడిటర్ : మారేపల్లి అశోక్ పేజిలు -8 వెల - 3/-

Published From Hyderabad : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts

## ముగిసిన శుభాంశు రోదసీయాత్ర

### క్షేమంగా భూమ్మీదకు చేరుకున్న భారత వ్యోమగామి

### ప్రధాని మోడీ తదితరుల శుభాకాంక్షలు



కాలిఫోర్నియా **జూలై 15ప్రజావినికిడి:** భారత వ్యోమగామి శుభాంశు శుక్లా రోదసీయాత్ర ముసిగింది. ఆయన తిరగి క్షేమంగా భూమ్మీదకు చేరుకున్నారు. యాక్సియం-4 మిషన్‌లో భాగంగా అంతరిక్ష పరిశోధన కేంద్రం ఐఎస్ఎస్‌కి వెళ్లిన భారత వ్యోమగామి శుభాంశు శుక్లా తిరిగి భూమిపైకి చేరుకున్నారు. అంతరిక్షంలో ఆయన 18 రోజులు గడిపారు. మిగతాది 2లో...

## భారత్‌లో టెస్లా

### ముంబైలో తొలి షోరూమ్ ప్రారంభం -ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న సిఎం ఫడ్నవీస్




## జీనోమ్ వ్యాలీలోని పరిశ్రమలు తెలంగాణకు గుర్తింపు

### దేశంలోని వ్యాక్సిన్లలో 33 శాతం జీనోమ్ వ్యాలీ నుంచే ఉత్పత్తి చేస్తున్నామని వెల్లడి

### ఇక్కడి వ్యాక్సిన్లను ప్రపంచ దేశాలకు సరఫరా చేశామన్న రేవంత్ రెడ్డి



హైదరాబాద్, **జూలై 15ప్రజావినికిడి:**
ప్రపంచ బల్క్ డ్రగ్స్ రాజధానిగా హైదరాబాద్ రూపుదిద్దుకుందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. జీనోమ్ వ్యాలీలోని పరిశ్రమలు తెలంగాణకే గుర్తింపును తీసుకొచ్చాయి. దేశంలోని వ్యాక్సిన్ల ఉత్పత్తిలో 33 శాతం కేవలం జీనోమ్ వ్యాలీ నుంచే ఉత్పత్తి చేస్తున్నాం. ప్రపంచాన్ని కోవిడ్ భయపెడుతున్న సమయంలో ఇక్కడి నుంచే వ్యాక్సిన్లు తయారు చేశాం. మిగతాది 2లో...

# బనకచర్లపై చర్చ అవసరం లేదు

## కేంద్రానికి తెలంగాణ కీలక లేఖ



ఏపీ, తెలంగాణ ముఖ్యమంత్రుల సమావేశం..

బనకచర్ల అజెండాపై తెలంగాణ అభ్యంతరం

పెండింగ్ ప్రాజెక్టులు సహా వివిధ అంశాలను అజెండాగా పంపిన తెలంగాణ

బనకచర్లకు ఎలాంటి అనుమతులు లేవన్న తెలంగాణ ప్రభుత్వం

హైదరాబాద్, **జూలై 15ప్రజావినికిడి:** గోదావరి-బనకచర్ల ప్రాజెక్టుకు సంబంధించి కేంద్ర ప్రభుత్వానికి తెలంగాణ ప్రభుత్వం లేఖ రాసింది. ఈ అంశంపై చర్చించేందుకు కేంద్ర జలశక్తి శాఖ నుండి రెండు తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులకు పిలుపు వచ్చింది. ఈ నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం లేఖ రాసింది. కేంద్రమంత్రి సీఆర్ పాటిల్ అధ్యక్షతన జరిగే సమావేశంలో బనకచర్లపై చర్చ అవసరం లేదని తెలంగాణ ప్రభుత్వం ఆ లేఖలో స్పష్టం చేసింది.కృష్ణా నదిపై పెండింగ్ ప్రాజెక్టులకు అనుమతులను అజెండాగా ప్రతిపాదించింది. పాలమూరు, దిండి ప్రాజెక్టులకు జాతీయ హెూదా, ఇచ్చంపల్లి ప్రాజెక్టును కేంద్రం చేపట్టాలని, తుమ్మిడిహెట్టి వద్ద ప్రాణహిత ప్రాజెక్టుకు 80 టీఎంసీలు కేటాయించాలని అజెండాగా పంపించింది. ఏపీ ఇచ్చిన బనకచర్ల అజెండాపై తెలంగాణ అభ్యంతరం తెలిపింది.బనకచర్లకు ఎలాంటి అనుమతులు లేవని, చట్టాలు, ట్రైబ్యునల్ తీర్పుల ఉల్లంఘన జరుగుతోందని ఆ లేఖలో ప్రస్తావించింది 2లో...

## ఇరిగేషన్ మాజీ ఈఎన్‌సీ అరెస్ట్

మురళీధర్‌రావు అక్రమాస్తులు రూ.కోట్లలోనే

ఆయన ఆస్తులపై ఏసీబీ మెరుపుదాడులు

హైదరాబాద్‌తో పాటు కరీంనగర్‌లో సోదాలు




## కాల్పుల కలకలం

సీపీఐ రాష్ట్ర నాయకుడు చందునాయక్ మృతి

కండ్లలో కారం చల్లి ఫైరింగ్

ఆధారాలు సేకంచిన క్లూస్ టీమ్స్,

ఐదు రౌండ్ల బుల్లెట్లు స్వాధీనం

నిందితుల కోసం 10 బృందాలతో గాలింపు

మలక్‌పేట శాలివాహననగర్ పార్కులో ఘటన



మలక్‌పేట్ **జూలై 15ప్రజావినికిడి:**
హైదరాబాద్ నగర నడిబొడ్డున కాల్పులు కలకలం రేపాయి. మలక్‌పేట్ శాలివాహననగర్ పార్క్‌లో ఉదయం వాకింగ్‌కు వెళ్లిన సీపీఐ రాష్ట్ర నాయకులు చందు నాయక్(43)పై అందరూ చూస్తుండగానే సినిమా తరహాలో దుండగులు తుపాకులతో కాల్చి దారుణంగా హత్య చేశారు. ఏం జరిగిందో అర్థమయ్యేలోపే కారులో వచ్చిన వారు ఆరు రౌండ్లు కాల్పులు జరిపి అక్కడి నుంచి పరారయ్యారు. ఈ ఘటనలో చందునాయక్ అక్కడికక్కడే మృతిచెందారు. దీంతో పార్కులో ఉన్నవారు, స్థానికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. మిగతాది 2లో...

## మల్లు భట్టివిక్రమార్కకు బీజేపీ అధ్యక్షుడు లీగల్ నోటీసులు

రోహిత్ వేముల ఆత్మహత్య అంశంపై రామచందర్ రావుపై ఆరోపణలు

తనకు బేషరతుగా క్షమాపణ చెప్పాలని బీజేపీ అధ్యక్షుడి డిమాండ్

లేదంటే రూ. 25 కోట్లకు పరువు నష్టం దావా వేస్తానని హెచ్చరిక




## విద్యార్థుల మరణాలకు రేవంత్ బాధ్యత వహించాలి: కేటీఆర్

ఫుడ్ పాయిజనింగ్ కారణంగా వందకు పైగా విద్యార్థులు ప్రాణాలు కోల్పోయారన్న కేటీఆర్

రేవంత్ ఒక్క సమీక్ష కూడా నిర్వహించలేదని విమర్శ




## అమిత్ షాతో భేటీ

### ఢిల్లీలో కేంద్ర హెూంమంత్రి అమిత్ షాను కలిసిన ఏపీ సీఎం చంద్రబాబు

### ఏపీకి మరింత ఆర్థిక సాయం అందించాలని విజ్ఞప్తి

ఢిల్లీ: **జూలై 15ప్రజావినికిడి:** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు ఢిల్లీలో కేంద్ర హెూంమంత్రి అమిత్ షాతో సమావేశమయ్యారు. ఈ భేటీలో రాష్ట్రానికి మరింత ఆర్థిక సహాయం అందించాలని చంద్రబాబు కేంద్రాన్ని కోరారు. రాష్ట్రం ఇంకా తీవ్ర ఆర్థిక వనరుల కొరతను ఎదుర్కొంటున్నందున, ఆర్థిక వ్యవస్థను తిరిగి గాడిన పెట్టడానికి కేంద్రం సహాయం అవసరమని ఆయన అమిత్ షాకు వివరించారు. ఈ భేటీ సందర్భంగా, చంద్రబాబు వివిధ ప్రాజెక్టులు మరియు అభివృద్ధి కార్యక్రమాలకు ఆర్థిక సహాయం ఆవశ్యకతను వివరించారు. రాష్ట్ర విభజన కారణంగా ఆంధ్రప్రదేశ్ ఎదుర్కొన్న ఆర్థిక నష్టాలను పరిగణనలోకి తీసుకోవాలని 16వ ఆర్థిక సంఘాన్ని కూడా ఆయన అభ్యర్థించారు. మిగతాది 2లో...



## ముస్లింలను కలిపి బీసీలకు అన్యాయం చేసే కుట్ర




తెలుగు రాష్ట్రాల సీఎంల సమావేశంలో రేవంత్ రెడ్డి తెలంగాణ వాదన గట్టిగా వినిపించాలి!: బండి సంజయ్

తెలంగాణకు కేంద్ర ప్రభుత్వం అన్యాయం చేయదన్న బండి సంజయ్

కేంద్ర ప్రభుత్వానికి రెండు రాష్ట్రాలు సమానమేనని వ్యాఖ్య

ముస్లింలను కలిపి బీసీలకు అన్యాయం చేసే కుట్ర జరుగుతోందని ఆరోపణ

# ఇరిగేషన్ మాజీ ఈఎన్‌సీ అరెస్ట్

హైదరాబాద్, **జూలై 15ప్రజావినికిడి:** రాష్ట్రంలో నీటిపారుదల శాఖకు చెందిన మరో అవినీతి తిమింగళం ఏసీబీ వలకు చిక్కింది. కాళేశ్వరం ప్రాజెక్ట్ ఇంజినీర్ ఇన్ చీఫ్(ఈఎన్సీ)గా పని చేసి రిటైర్ అయిన సి. మురళీధర్‌రావుకు చెందిన కోట్లాది రూపాయల అక్రమాస్తుల గుట్టును రాష్ట్ర అవినీతి నిరోధక శాఖ(ఏసీబీ) అధికారులు మంగళవారం రట్టు చేశారు. ఏసీబీ డైరెక్టర్ జనరల్ విజరుకుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. నీటిపారుదల శాఖ రిటైర్డ్ ఇంజినీర్ మురళీధర్‌రావు అవినీతి, అక్రమాలకు పాల్పడి కోట్లాది రూపాయల విలువైన ఆదాయానికి మించిన ఆస్తులను సంపాదించినట్టు ఏసీబీకి విశ్వసనీయ సమాచారం అందింది. దీంతో ఏసీబీ అధికారులు హైదరాబాద్‌లోని బంజారాహిల్స్‌తోపాటు కరీంనగర్, హుజూరాబాద్‌లలోని మురళీధర్‌రావుకు చెందిన ఆస్తులు, వారి సమీప బంధువుల ఆస్తులపై మెరుపుదాడులను నిర్వహించారు. మొత్తం 11 ప్రాంతాల్లో ఈ మెరుపుదాడులు సాగించారు. ఈ దాడుల్లో మురళీధర్‌రావు కొనుగోలు చేసిన విల్లాలు, అపార్ట్‌మెంట్‌లు, విలువైన ప్రాంతాల్లో ఇండ్ల స్థలాలు, ఎకరాల్లో వ్యవసాయ భూమితో పాటు నివాసంలో అత్యంత విలువైన బంగారు నగలు, నగదును ఏసీబీ అధికారులు కనుగొన్నారు. వీరు జరిపిన దాడుల్లో%ూ% కొండాపూర్‌లోని ఒక విల్లా, బంజారాహిల్స్, యూసఫ్‌గూడ, బేగంపేట్, కోకాపేట్‌లలో ఒకటి చొప్పున ఫ్లాట్‌లు, హైదరాబాద్, కరీంనగర్‌లో ఒకటి చొప్పున కమర్షియల్ బిల్డింగ్‌లు, కోదాడలో ఒక అపార్ట్‌మెంట్, జహీరాబాద్‌లో ఒక 2కేడబ్ల్యూ సోలార్ పవర్ ప్రాజెక్ట్, వరంగల్‌లో నిర్మాణంలో ఉన్న ఒక అపార్ట్‌మెంట్‌ను గుర్తించారు. అలాగే, హైదరాబాద్‌లో నాలుగు రెసిడెన్షియల్ ప్రైమ్ ఓపెన్ ప్లాట్లు, మోకిలాలో 6500 చదరపు గజాల భూమి, మెర్సిడిస్ బెంజ్ కారుతో సహా మూడు ఫోర్ వీలర్ వాహనాలు, బంగారు ఆభరణాలు, బ్యాంకు డిపాజిట్లను అధికారులు కనుగొన్నారు. ప్రస్తుతం దాడుల్లో బయటపడిన ఆస్తుల మార్కెట్ విలువ ఐదింతలు ఎక్కువగా ఉంటుందనీ, అది కోట్లాది రూపాయల్లో ఉంటుందని ఏసీబీ అధికారులు అంచనా వేస్తున్నారు. నిందితుడు మురళీధర్‌రావుపై ఆదాయానికి మించిన ఆస్తుల కేసును నమోదు చేయటంతో పాటు అరెస్టు చేశామని అధికారులు తెలిపారు. ఇంకా ఆయన ఆస్తులపై సోదాలు కొనసాగుతున్నాయని చెప్పారు.

# ముగిసిన శుభాంశు రోదసీయాత్ర

**(మొదటి పేజి తరువాయి)**

మానవాళికి ఉపయోగపడే ప్రయోగాలు చేశారు. అనంతరం డ్రాగన్ క్యాప్స్‌లో కాలిఫోర్నియా సమీపంలోని సముద్ర జలాలలో మంగళవారం మధ్యాహ్నం 3.01 గంటలకు సురక్షితంగా దిగారు. భూమికి తిరిగి రావడం సంతోషంగా ఉందని యాక్సియం-4 కమాండర్ పెగ్గీ విట్సన్ తెలిపారు. అంతరిక్ష పరిశోధన కేంద్రంలో అడుగుపెట్టిన తొలి భారతీయుడిగా శుభాంశు శుక్లా రికార్డు సృష్టించారు. కాగా, భూమిపైకి చేరుకున్న ఈ వ్యోమగాయుల బృందాన్ని ఏడు రోజుల పాటు క్వారెంటైన్‌లో ఉంచనున్నట్లు స్పేస్ ఎక్స్ అధికారులు తెలిపారు. శుభాంశు శుక్లా బృందం భూమికి సురక్షితంగా చేరుకోవడంపై ప్రధాని మోదీ హర్షం వ్యక్తం చేశారు. ఐఎస్ఎస్‌ను సందర్శించిన తొలి భారతీయ వ్యోమగామిగా చరిత్ర సృష్టించిన శుభాంశు.. పట్టుదల, అంకితభావం, సాహస చర్యల ద్వారా కోట్లాది మందికి స్ఫూర్తిగా నిలిచారని ఎక్స్ వేదికగా కొనియాడారు. ఇది మన సొంత మానవ సహిత అంతరిక్ష ప్రయోగం గగన్‌యాన్‌కు దిక్సూచిగా నిలుస్తుందన్నారు. అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలో పలు పరిశోధనలు చేపట్టిన యాక్సియం-4 మిషన్ బృందం.. స్పేస్‌ఎక్స్‌కు చెందిన క్రూ డ్రాగన్ గ్రేస్ వ్యోమనౌకలో సోమవారం బయలుదేరింది. భారత వ్యోమగామి శుభాంశు శుక్లాతో పాటు పెగ్గీ విట్సన్, స్లావోస్జ్ ఉజ్నాన్స్కీ-విస్నియెస్కీ, టిబర్ కపులు ఈ బృందంలో ఉన్న సంగతి తెలిసిందే. ఇకపోతే శుభాంశు శుక్లా తిరిగి భూమికి చేరుకోవడంపై సర్వత్ర హర్షం వ్యక్తం అవుతోంది. ఆయన తిరిగి భూమికి వచ్చిన సందర్భంగా స్వస్థలం లక్నోలో కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఆయన తల్లిదండ్రులు భావోద్వేగంతో కన్నీళ్లు పెట్టుకున్నారు.

# కాల్పుల కలకలం

పోలీసుల వివరాలు ప్రకారం.. నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట గ్రామానికి చెందిన సీపీఐ రాష్ట్ర నాయకులు కేతావత్ చందు నాయక్ రాథోడ్ చైతన్యపురిలో నివాసం ఉంటున్నారు. మంగళవారం ఉదయం తన భార్య, కుమార్తెతో కలిసి మలక్‌పేట్‌లోని శాలివాహననగర్ పార్కులో వాకింగ్‌కు వచ్చారు. వాకింగ్ చేస్తున్న సమయంలో ఉదయం 7.20 గంటల ప్రాంతంలో గుర్తుతెలియని నలుగురు వ్యక్తులు వచ్చి ముందుగా చందునాయక్ కండ్లలో కారం చల్లారు. ఆయన తెరుకునేలోపే తుపాకులతో ఆరు రౌండ్లు కాల్పులకు తెగబడ్డారు. ఘటనలో ఆయన అక్కడికక్కడే మృతిచెందారు. కాల్పుల మోత వినిపించడంతో పార్కులోని వాళ్లందరూ భయాందోళనతో పరుగులు తీశారు. సమా చారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని కొన్ని ప్రాథమిక ఆధా రాలు సేకరించారు. పాత కక్షల నేపథ్యంలోనే ఈ హత్య జరిగిందని పోలీసులు అనుమానిస్తున్నారు. సోమవారం రాత్రి నుంచే చందునాయక్ ఇంటిదగ్గర కొందరు అనుమానాస్పదంగా సంచరించినట్టు సీసీ కెమెరాలను పరిశీలించిన పోలీసులు గుర్తించారు. మృతుని భార్య, కుటుంబ సభ్యులు ఇంటికి వెళ్లిన తర్వాతే చందునా యక్‌పై దాడి చేసినట్టు వారు తెలిపారు. 2022లో ఎల్బీనగర్ పరిధిలో జరిగిన ఎమ్మార్పీఎస్ నాయకుల హత్య కేసులో చందునాయక్ నిందితునిగా ఉన్నారు. కాగా, చందు నాయక్ ఎక్కడికి వెళ్లినా భార్యా పిల్లలు వెంట ఉంటారని స్థానికులు, బంధు వులు తెలిపారు. ఈ కేసును పూర్తిస్థాయిలో దర్యాప్తు చేసి నిందితులను త్వరలోనే పట్టుకుంటామని ఎస్ఐ పిడమర్తి నరేశ్ తెలిపారు. సంఘటనా స్థలాన్ని డీసీపీ చైతన్యకుమార్, ఏసీపీ సుబ్బరామిరెడ్డి పరిశీలించారు. చందునాయక్ మరణ వార్త విని అభిమానులు, బంధువులు, స్నేహితులు ఆయన స్వగృహానికి భారీగా తరలివచ్చారు. సంఘ టనా స్థలాన్ని తనిఖీ చేసిన క్లూస్ టీమ్స్ కీలక ఆధా రాలను సేకరించాయి. ఇదిలావుండగా కాల్పులకు తెగబడ్డ నింది తులు పోలీసుల అదుపులో ఉన్నట్టు పెద్దఎత్తున ప్రచారం జరుగుతోంది.

# బనకచర్లపై చర్చ అవసరం లేదు

**(మొదటి పేజి తరువాయి)**

గోదావరి - బనకచర్ల లింక్ ప్రాజెక్టుపై చర్చించడం అనుచితమని పేర్కొంది. ఇలాంటి చర్యలతో కేంద్ర ప్రభుత్వ నియంత్రణ సంస్థలపై నమ్మకం పోతుందని పేర్కొంది.కాగా, గోదావరి-బనకచర్ల ప్రాజెక్టు విషయమై ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల ముఖ్యమంత్రులు చంద్రబాబునాయుడు, రేవంత్ రెడ్డిలతో కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్ రేపు సమావేశం కానున్నారు. ఈ మేరకు జలశక్తి శాఖ ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రుల కార్యాలయాలు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులకు సమాచారం పంపించింది. ఢిల్లీలోని జలశక్తి ప్రధాన కార్యాలయం శ్రమశక్తి భవన్‌లో మధ్యాహ్నం రెండున్నర గంటలకు ఈ సమావేశం జరగనుంది. ఈ అంశంతో పాటు ఏమైనా అజెండా అంశాలు ఉంటే పంపించాలని జలశక్తి శాఖ కోరింది.

# ముస్లింలను కలిపి బీసీలకు అన్యాయం చేసే కుట్ర

హైదరాబాద్, **జూలై 15ప్రజావినికిడి:**
ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబుతో జరగనున్న సమావేశంలో తెలంగాణ వాణిని బలంగా వినిపించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ సూచించారు. కేంద్ర జలశక్తి శాఖ నుంచి తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులకు పిలుపు వచ్చింది. రేపు ఈ సమావేశం జరగనుంది. ఈ నేపథ్యంలో బండి సంజయ్ స్పందించారు.తెలంగాణకు కేంద్ర ప్రభుత్వం ఎట్టి పరిస్థితుల్లోనూ అన్యాయం చేయదని ఆయన అన్నారు. కేంద్రానికి రెండు రాష్ట్రాలు సమానమేనని స్పష్టం చేశారు. బనకచర్ల ప్రాజెక్టు వల్ల తెలంగాణకు జరిగే నష్టాన్ని ముఖ్యమంత్రి వివరించాలని సూచించారు. కరీంనగర్‌లో పర్యటించిన బండి సంజయ్ మాట్లాడుతూ, బీసీలకు కాంగ్రెస్ ప్రభుత్వం అన్యాయం చేసే కుట్రలు జరుగుతున్నాయని ఆరోపించారు.రేవంత్ రెడ్డి ప్రభుత్వం చేసే అన్యాయాన్ని బీసీ సంఘాలు ఎందుకు ప్రశ్నించడం లేదని ఆయన నిలదీశారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ చేసిన సమగ్ర సర్వేలో బీసీలు 51 శాతమని తేలితే, కాంగ్రెస్ సర్వేలో మాత్రం 46 శాతంగా ఉండటం ఏమిటని ప్రశ్నించారు.బీసీలలో ముస్లింలను కలపడం సరికాదని ఆయన అన్నారు. బీసీ ఆర్డినెన్స్‌ను తాము వ్యతిరేకించబోమని, కానీ బీసీల్లో ముస్లింలను కలిపితే మాత్రం అడ్డుకుంటామని తేల్చి చెప్పారు. బీసీ రిజర్వేషన్లలో ముస్లింలను కలుపుతూ అన్యాయం చేస్తోందని, బీసీ నాయకులు ప్రభుత్వాన్ని నిలదీయాలని అన్నారు.

# భారత్‌లో అడుగుపెట్టిన టెస్లా

## ముంబైలో తొలి షోరూమ్ ప్రారంభం -ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న సిఎం ఫడ్నవీస్





ముంబై, **జూలై 15ప్రజావినికిడి:**
టెస్లీ కార్లు ఇక భారత రోడ్లపై పరుగెట్టనున్నాయి. ఎంతోకాలంగా అభిమానులు ఎదురు చూస్తున్న ఘడియ వచ్చింది. అమెరికాకు చెందిన ఎలక్ట్రిక్ కార్ల తయారీ సంస్థ టెస్లా భారత మార్కెట్లోకి ప్రవేశించింది. ముంబయిలో తొలి షోరూంను మంగళవారం ప్రారంభించింది. బాంద్రా కుర్లా కాంప్లెక్స్‌లోని మార్కర్ మ్యాక్సిటీ మాల్‌లో దానిని తెరిచింది. ఈ షోరూం ప్రారంభోత్సవానికి రాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్ హాజరయ్యారు. భారత్‌లో తొలిగా ముంబైలో అడుగుపెట్టిన ఈ సంస్థకు ఘనంగా స్వాగతం చెప్పారు. షోరూం ప్రారంభోత్సవం సందర్భంగా సీఎం దేవేంద్ర ఫడణవీస్ మాట్లాడుతూ టెస్లా సరైన రాష్ట్రం, నగరాన్ని ఎంచుకుంది. ఈ కంపెనీ కార్ల డిజైన్, ఇన్నోవేషన్‌పై ప్రపంచవ్యాప్తంగా ఆసక్తి ఉంటుంది. 2015లో అమెరికా పర్యటనకు వెళ్లినప్పుడు తొలిసారి టెస్లా కారులో తిరిగానని ఫడణవీస్ అన్నారు. టెస్లా దీర్ఘకాలిక ప్రణాళికల గురించి ఎన్నో ఊహాగానాలు వినిపిస్తున్నప్పటికీ.. ప్రస్తుతానికి స్థానికంగా దీని తయారీపై ఎలాంటి ప్రకటనా వెలువడలేదు.భారత్‌లో ఈ ఎలక్ట్రిక్ కార్ల తయారీకి సంబంధించిన భవిష్యత్ ప్రణాళికలపై ఆశాభావం వ్యక్తంచేశారు. ఈసందర్భంగా 'మోడల్ వై' కారును సంస్థ ఆవిష్కరించింది. తొలుత 'మోడల్ వై' ఈవీలను -టె-స్లా భారత్ మార్కెట్లో విక్రయించనుంది. ఇక్కడ ఆర్‌డబ్ల్యూడీ వెర్షన్ (బేస్) 'మోడల్ వై' ఆన్‌రోడ్ ధర రూ.61.07 లక్షలుగా నిర్ణయించింది. లాంగ్‌రేంజ్ వెర్షన్ ధర రూ.69.15లక్షలుగా ఉంది. బేస్ మోడల్ ధర అమెరికాలో 44,990 డాలర్లు (రూ.38.63 లక్షలు), చైనాలో 2,63,500 యువాన్లు (రూ.31.57లక్షలు) జర్మనీలో 45,970 యూరోలు (రూ.46.09లక్షలు)గా ఉంది. దిగుమతి సుంకాలు, రవాణా ఖర్చుల కారణంగా భారత్‌లో దీని ధర ఎక్కువగా ఉంది. కొన్నిరోజుల క్రితం భారత రోడ్లపై 'మోడల్ వై' ను పరీక్షించిన సంగతి తెలిసిందే. ముంబయి-పుణే జాతీయరహదారిపై ఈ వాహనం దర్శనమివ్వడం చూపరులను ఆకర్షించింది. ఇది పూర్తిగా అప్‌డేట్ అయిన మోడల్ కారుగా నిపుణులు గుర్తించారు. దీని కోడ్‌నేమ్ జునిపెర్. అడ్వాన్స్‌డు వర్షన్‌ను అమెరికా, కెనడా మార్కెట్లలో వీటిని విక్రయిస్తున్నారు. దీని సీ షేప్‌లోని ఎల్ఈడీ లైట్లు-, ట్విన్ స్పోక్ అలాయ్ వీల్స్, -టె-స్లా ప్రత్యేకతను తెలిపే గ్లాస్ రూఫ్ ఉన్నాయి. ఇది భారత్‌లో ఆరు రంగుల్లో లభించవచ్చని భావిస్తున్నారు.
ప్రపంచవ్యాప్తంగా మోడల్ వై కారు ఆల్‌వీల్ డ్రైవ్‌గా లభిస్తోంది. వీటిల్లో లాంగ్ రేంజ్ బ్యాటరీ ప్రత్యేకత. ఒక్కసారి ఛార్జి చేస్తే 500-600 కిలోమీటర్ల వరకు ప్రయాణించవచ్చు. కేవలం 4.6 సెకన్లలో గంటకు 0-96 కిలోమీటర్ల వేగాన్ని అందుకొంటుంది. అత్యధికంగా గంటకు 200 కి.మీ. వేగంతో ప్రయాణించగలదు. దీనిలో భారీ 15.4 అంగుళాల టచ్‌స్క్రీన్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్‌ను అమర్చారు. వెనక సీట్లలోని ప్యాసింజర్ల కోసం 8 అంగుళాల ప్రత్యేకమైన స్క్రీన్ కూడా ఉంటు-ంది. అడాస్ ఫీచర్లు, వైర్‌లెస్ ఫోన్ ఛార్జింగ్ వంటి హంగులు ఇందులో కస్టమర్లకు లభించనున్నాయి.

# విద్యార్థుల మరణాలకు రేవంత్ బాధ్యత వహించాలి: కేటీఆర్

**ఫుడ్ పాయిజనింగ్ కారణంగా వందకు పైగా విద్యార్థులు ప్రాణాలు కోల్పోయారన్న కేటీఆర్**

**రేవంత్ ఒక్క సమీక్ష కూడా నిర్వహించలేదని విమర్శ**

హైదరాబాద్, **జూలై 15ప్రజావినికిడి:**
రాష్ట్రంలో విద్యార్థుల ఫుడ్ పాయిజనింగ్ ఘటనలకు సంబంధించి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మరోసారి విమర్శలు గుప్పించారు. ఈ ఘటనలకు, విద్యార్థుల మరణాలకు రేవంత్ పూర్తి బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. ఏడాది కాలంలో వేలాది మంది విద్యార్థులు ఫుడ్ పాయిజనింగ్ తో అనారోగ్యం పాలయ్యారని, వందకు పైగా విద్యార్థులు ప్రాణాలు కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యాశాఖ కూడా ఆయన చేతిలోనే ఉన్నప్పటికీ ఇంతవరకు ఒక్క సమీక్ష కూడా నిర్వహించలేదని విమర్శించారు.
కనీసం ఒక తండ్రిగానైనా రేవంత్ స్పందించాలని... పిల్లలు కలిగిన ఒక తండ్రిగా కోరుతున్నానని కేటీఆర్ అన్నారు. మీ పిల్లలకు విషం కలిపిన ఆహారాన్ని ప్రభుత్వం పెడితే మీరు ఊరుకుంటారా? అని ప్రశ్నించారు. విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని దుయ్యబట్టారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి సరైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ తీరును ప్రజలు గమనిస్తున్నారని... తగిన సమయంలో తీర్పు ఇస్తారని చెప్పారు.

# జీనోమ్ వ్యాలీలోని పరిశ్రమలు తెలంగాణకు గుర్తింపు

**(మొదటి పేజి తరువాయి)**

ప్రపంచ దేశాలకు సరఫరా చేయగలిగామని సీఎం అన్నారు. శామీర్‌పేట జీనోమ్‌వ్యాలీలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పర్యటించారు. ఐకోర్ బయోలాజిక్స్ పరిశ్రమ ఏర్పాటుకు శంకుస్థాపన చేశారు. మంగళవారం ఐకార్ బయోలజిక్స్ కొత్త యూనిట్ కు సిఎం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడారు. దేశంలోనే 33 శాతం వ్యాక్సిన్స్ , బల్క్ డ్రగ్స్‌లో 43 శాతం ఇక్కడి నుంచే ఉత్పత్తి అవుతున్నాయని నొక్కిచెప్పారు. కోవిడ్ సమయంలో జీనోమ్ వ్యాలీ నుంచే ప్రపంచ దేశాలకు వ్యాక్సిన్‌ను ఎగుమతి చేసిన ఘనత ఇక్కడి పారిశ్రామికవేత్తలదని సీఎం రేవంత్‌రెడ్డి ఉద్ఘాటించారు.ప్రభుత్వాలు మారినా పారిశ్రామిక విధానాన్ని ముందుకు తీసుకెళ్లే విధంగానే ప్రభుత్వాల నిర్ణయాలు ఉన్నాయని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పుకొచ్చారు. తమ ప్రభుత్వం మరింత సరళమైన విధానాలతో ముందుకెళ్తుందని పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో హైదరాబాద్ డేటా సిటీగా మారనుందని ఉద్ఘాటించారు. తాము అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు రూ. 3లక్షల 28 వేల కోట్లు పెట్టుబడులు సాధించామని స్పష్టం చేశారు. ప్రపంచ దేశాలతో పోటీ- పడాలని, అధునాతన విధానాలను తీసుకురావాలని ప్రయత్నిస్తున్నామని చెప్పుకొచ్చారు. రాబోయే పదేళ్లలో తెలంగాణను వన్ ట్రిలియన్ ఎకానమీగా తీర్చి దిద్దడమే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నామని నొక్కిచెప్పారు. ఇందుకు జీనోమ్ వ్యాలీ పారిశ్రామికవేత్తల సహకారం ఉండాలని సీఎం రేవంత్‌రెడ్డి కోరారు.అంతకుముందు మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. జీనోమ్‌వ్యాలీ ఆసియా ఖండంలోనే ప్రత్యేకమైందిగా గుర్తింపు పొందిదన్నారు. జీవ శాస్త్రాల అభివృద్ధికి అవసరమైన ఎకో సిస్టమ్ హైదరాబాద్‌లో ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రులు శ్రీధర్‌బాబు, వివేక్, ఉన్నతాధికారులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడారు.

# ఢిల్లీలో కేంద్ర హోంమంత్రి అమిత్ షాను కలిసిన ఏపీ సీఎం చంద్రబాబు

**(మొదటి పేజి తరువాయి)**

పోలవరం-బనకచెర్ల లింక్ ప్రాజెక్ట్ గురించి కూడా చర్చ జరిగింది. ఈ ప్రాజెక్ట్ ద్వారా పోలవరం నుండి 200 టీఎంసీల వరద నీటిని కర్నూలు జిల్లాలోని బనకచెర్ల రెగ్యులేటర్‌కు మళ్లించి కరువు పీడిత రాయలసీమ ప్రాంతానికి ప్రయోజనం చేకూర్చాలని లక్ష్యంగా పెట్టుకున్నామని చంద్రబాబు తెలిపారు. గోదావరి నది మిగులు జలాలను ఉపయోగించుకోవడానికి ఆంధ్రప్రదేశ్‌కు ఉన్న హక్కును చంద్రబాబు నొక్కి



చెప్పారు.గోవా గవర్నర్‌గా సీనియర్ టీడీపీ నాయకుడు అశోక్ గజపతి రాజును నియమించినందుకు ముఖ్యమంత్రి కేంద్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. చంద్రబాబు నీతి ఆయోగ్ సభ్యుడు వీకే సరస్వత్‌తో రాయలసీమ ప్రాంతంలో ఏరోస్పేస్ మరియు డిఫెన్స్ పరిశ్రమల స్థాపనపై చర్చించారు. అలాగే, విశాఖపట్నం మరియు విజయవాడలలో మెట్రో ప్రాజెక్టులపై చర్చించడానికి ఢిల్లీ మెట్రో రైల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ వికాస్ కుమార్‌తో కూడా సమావేశమయ్యారు.

# మల్లు భట్టివిక్రమార్కకు బీజేపీ అధ్యక్షుడు లీగల్ నోటీసులు

**రోహిత్ వేముల ఆత్మహత్య అంశంపై రామచందర్ రావుపై ఆరోపణలు**

**తనకు బేషరతుగా క్షమాపణ చెప్పాలని బీజేపీ అధ్యక్షుడి డిమాండ్**

**లేదంటే రూ. 25 కోట్లకు పరువు నష్టం దావా వేస్తానని హెచ్చరిక**

హైదరాబాద్, **జూలై 15ప్రజావినికిడి:**
తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్కకు రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు ఎన్. రామచందర్ రావు లీగల్ నోటీసులు పంపించారు. రోహిత్ వేముల ఆత్మహత్య అంశంపై భట్టివిక్రమార్క చేసిన వ్యాఖ్యలకు సంబంధించి ఆయన తరపు న్యాయవాది విజయ్‌కాంత్ ద్వారా ఈ నోటీసులు పంపించారు.
తనపై నిరాధార ఆరోపణలు చేసినందుకు మల్లు భట్టివిక్రమార్క మూడు రోజుల్లో బేషరతుగా క్షమాపణ చెప్పాలని ఆ నోటీసుల్లో డిమాండ్ చేశారు. అలా చేయని పక్షంలో రూ. 25 కోట్లకు పరువు నష్టం దావా వేస్తానని హెచ్చరించారు. క్షమాపణ చెప్పని పక్షంలో క్రిమినల్ కేసులు ఎదుర్కోవాల్సి ఉంటుందని కూడా పేర్కొన్నారు.

# గవర్నర్ వద్దకు బీసీ రిజర్వేషన్ల ముసాయిదా



హైదరాబాద్, **జూలై 15ప్రజావినికిడి:**
బీసీలకు రిజర్వేషన్ల పెంపు కోసం రాష్ట్ర ప్రభుత్వం రూపొందించి న ఆర్డినెన్స్ ముసాయిదా మంగళవారం రాజ్‌భవన్‌కు చేరింది. రిజర్వేషన్ల పెంపునకు వెసులుబాటు కల్పిస్తూ పంచాయతీరాజ్ చట్టం 2018లోని సెక్షన్ 285 క్లాజ్-ఎ సవరించాలని ఇటీవల రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయించిన సంగతి తెలిసిందే. ఆ సెక్షన్‌లో స్థానిక సంస్థల్లో 50 శాతానికి మించకుండా రిజర్వేషన్లు అమలవుతాయని ఉండగా..ఇప్పుడు 50 శాతానికి మించకుండా అనే వాక్యాన్ని తొలగిస్తూ ముసాయిదా రూపొందించింది. బీసీ రిజర్వేషన్ల పంచాయితీకి సాధ్యమైనంత త్వరగా ముగింపు పలకాలనే ఆలోచనలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉన్నారు. మంత్రి సీతక్క కార్యాలయం నుంచి ముసాయిదా సీఎంవోకు వచ్చిన వెంటనే దాన్ని గవర్నర్ పరిశీలనకు పంపారు. గవర్నర్ ఆమోదం పొందిన వెంటనే వారం రోజుల్లోగా గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసేందుకు పంచాయతీరాజ్ శాఖ కసరత్తు చేస్తోంది.

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక
బుధవారం 16 జులై 2025

### నాగోల్ డివిజన్అజయ్ నగర్ కాలనీ నూతన కార్యవర్గ సభ్యులు..

## ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి నికలిసి పలు సమస్యలపై వినతి పత్రం అందజేత..



**ప్రజావినికిడి,(ఎల్బీనగర్):** మంగళవారం రోజు ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డిని నాగోల్ డివిజన్ పరిధిలోని అజయ్ నగర్ కాలనీ నూతన కార్యవర్గ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా కాలనీవాసులు పలు సమస్యలను సుధీర్ రెడ్డి దృష్టికి తీసుకువచ్చారు.దానిలో భాగంగా ముఖ్యంగా నూతన డ్రైనేజీ వ్యవస్థ,రోడ్లు,ట్రాన్స్ఫార్మర్స్ ఏర్పాటు చేయాలని కోరారు.అలాగే వర్షపునీరు కొన్ని కొన్ని గల్లీల్లో నిల్చుంచుడం జరుగుతున్న నేపథ్యంలో ఔట్ లేట్ ఏర్పాటు చేయాలని కోరారు.అనంతరం సుధీర్ రెడ్డి మాట్లాడుతూ, ప్రణాళికబద్ధంగా అభివృద్ధి కార్యక్రమాలు చేయడం జరుగుతుందని హామీ ఇచ్చారు.దానిలో భాగంగా శివారు ప్రాంతాల్లో నివశిస్తున్న ప్రతి ఒక్కరికీ మంచినీటి సౌకర్యం కల్పించడం జరుగుతుంది అని తెలిపారు.అనంతరం రోడ్ల నిర్మాణం చేపట్టడం జరుగుతుంది అని తెలిపారు.అలాగే వర్షపునీరు నిలబడకుండా అధికారులచే చర్చించి తగు ప్రణాళికలు సిద్ధం చేస్తామని తెలిపారు.అలాగే నూతన ట్రాన్స్ఫార్మర్స్ కూడా మంజూరు చేస్తామని తెలిపారు.పార్టీలకు అతీతంగా అన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుంది అని తెలిపారు.నియోజకవర్గ అభివృద్దే తన లక్ష్యం అని తెలిపారు.ఈ కార్యక్రమంలో నాగోల్ డివిజన్ భారస పార్టీ అధ్యక్షులు తూర్పాటి.చిరంజీవి,కాలనీవాసులు రామకృష్ణ,విఠల్ రావు,సంపత్ గుప్తా, వెంకటేశ్వర్, వాసుదేవరావు, బాలచంద్రరవికుమార్,గజ్జల అశోక్ పాల్గొన్నారు.

## బీసీలు రాజ్యమేలాలి..

### రాష్ట్ర అధ్యక్షులు పాండు యాదవ్..



**ప్రజావినికిడి, (ఆబిడ్స్):** రాష్ట్రంలో 60 శాతం ఉన్న బీసీలందరూ రాబోయే ఎన్నికలలో మన ఓట్లు మనమే వేసుకొని రాజ్యాధికారమేలాలని బీసీ కులాల ఐక్య వేదిక రాష్ట్ర కమిటి అధ్యక్షులు పాండు యాదవ్ పిలుపునిచ్చారు.బీసీ కులాల ఐక్యవేదిక కాన్ఫరెన్స్ కార్యక్రమాన్ని బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్‌లో రాష్ట్ర ఉపాధ్యక్షులు బొక్క కాశీనాథ్ ముదిరాజ్ అధ్యక్షతన నిర్వహించారు.ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు పాండు యాదవ్ మాట్లాడుతూ, పదిశాతం లేని అగ్రకులాలు వారు రాష్ట్రాన్ని పరిపాలిస్తే 60 శాతం ఉన్న బీసీలం పరిపాలించుకునే సమయం ఆసన్నమైందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలలో రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన ఆర్డినెన్స్ 42 శాతం రిజర్వేషన్లను అమలుపై స్వాగతిస్తున్నామని ఎన్నికల ప్రక్రియ ప్రారంభం కాగానే ఏవో కారణాలు చూపించి వెనక్కి తీసుకోకుండా కచ్చితంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు.ఈకార్యక్రమంలో డాక్టర్ వినయ్ కుమార్,ఎర్ర సత్యనారాయణ, నరహరిచారి,వీజేఆర్ నారగోని,సంధ్యారాణి, జే.ఆరుణ్ కుమార్, విజయ్ మహేంద్ర,శెట్టి భాస్కర్,నర్సింహులు ముదిరాజ్, టి.చెన్నయ్య, ఎల్,భీమేష్,అశ్విని, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

### షాద్ నగర్ రైల్వే బ్రిడ్జ్ డిజైన్ అనుమతులు, పనుల ప్రారంభం గురించి రైల్వే ఉన్నతాఅధికారులను కలిసిన షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



**ప్రజావినికిడి,(షాద్ నగర్):**హైదరాబాద్ లో రైల్ భవన్ లో షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ షాద్ నగర్ రైల్వే బ్రిడ్జి డిజైన్ అనుమతుల పురోగతి పై రైల్వే ఉన్నతాధికారులను కలిశారు. గతంలో రైల్వే బ్రిడ్జ్ షాద్ నగర్ మరియు బుచ్చిగుడా గ్రామాలను కలుపు విధంగా ఇరు పక్క అనుసంధానం కొరకు రెండు భుజాల బ్రిడ్జ్ డిజైన్ చేయబడినది. %L.C No%.27 మూడు వంకలను కలుపు త్రిభుజాల జంక్షన్. మూడవ రోడ్డు చటాన్ పల్లి వైపు వేసే బ్రిడ్జి యొక్క డిజైన్ పనులు త్వరగా పూర్తి చేయాలని సౌత్ సెంట్రల్ రైల్వే డిప్యూటీ జనరల్ మేనేజర్ ఉదయ్ నాథ్,చీఫ్ ప్రాజెక్ట్ మేనేజర్ సాంబశివరావు ను కోరారు.ఈ కార్యక్రమంలో రోడ్డు భవనాల శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రవీందర్, ఏఇ సందీప్ తదితరులు పాల్గొన్నారు.

### మున్సిపాలిటీ మాస్టర్ ప్లాన్ తో సమస్యలను

# సత్వరం పరిష్కారం చేయవచ్చు..

## షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

**షాద్ నగర్,కొత్తూర్ మున్సిపాలిటీల సమగ్ర అభివృద్ధిపై అధికారులు,స్థానిక నాయకులతో సమీక్షా సమావేశం నిర్వహించిన ఎమ్మెల్యే..**



**ప్రజావినికిడి,(షాద్ నగర్):**పట్టణంలో ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం లో షాద్ నగర్ మున్సిపాలిటీ,కొత్తూర్ మున్సిపాలిటీ సమగ్ర అభివృద్ధిపై మున్సిపల్ అధికారులు,స్థానిక నాయకులతో షాద్ నగర్ ఎమ్మెల్యే, ప్రభుత్వ రంగ సంస్థల కమిటీ చైర్మన్ వీర్లపల్లి శంకర్ సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా షాద్ నగర్,కొత్తూర్ మున్సిపాలిటీ ని సుందరమైన, అభివృద్ధి చెందిన పట్టణాలుగా తీర్చిదిద్దేందుకు తీసుకోవాల్సిన చర్యలపై అంశాల వారీగా చర్చించారు. మున్సిపాలిటీ పరిధిలో వ్యర్థల సేకరణ,నిర్వహణ పకడ్బంది చేయాలని అన్నారు. మున్సిపాలిటీలో ఎక్కడా విద్యుత్ సమస్యలు లేకుండా విద్యుత్ నిర్వహణ ఉండాలని అన్నారు.షాద్ నగర్ కొత్తూర్ పట్టణంలో అనువైన స్థలాలలో పార్కులు అభివృద్ధి చేయాలని సూచించారు.పట్టణంలో ప్రధాన కూడళ్లను సుందరికణ చేయాలని,అలాగే ప్రధాన రహదారులను వెడల్పు చేయాలని అన్నారు.ప్రభుత్వ భూమి కబ్జా చేసే ఎవరినైనా,చివరికి నా చుట్టమైనా సరే,కఠిన చర్యలు తీసుకుంటాం అని తెలిపారు. పట్టణాలు వేగంగా అభివృద్ధి చెందుతున్నాయి.కావున మాస్టర్ ప్లాన్ తప్పకుండా తయారు చేయాల్సిన అవసరమును వివరించారు.డ్రైనేజీ, వాటర్ పైప్ లైన్ వివరాలు,స్ట్రీట్ లైట్ వివరాలు క్లుప్తంగా వచ్చేటట్లు మాస్టర్ ప్లాన్ సిద్ధం చేయాలని కోరారు.అధికారులు బదిలీ అయిన కానీ మాస్టర్ ప్లాన్ ఉంటే కొత్తగా వచ్చే ఉద్యోగులు త్వరగా మున్సిపాలిటీ స్వరూపాన్ని తెలుసుకొనిసత్వరంగా సమస్యలను పరిష్కరించడానికి అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.గత పది సంవత్సరాలుగా ప్రభుత్వ భూములు అన్యాక్రాంతమయ్యాయని,దొంగ పట్టాలు సృష్టించి ప్రభుత్వ భూములు కబ్జా చేశారని,వాటిని గుర్తించి రికవరీ చేయాలని, అవసరమైతే వారిపై కేసులు పెట్టి కఠిన చర్యలు తీసుకోవాలని మున్సిపల్ అధికారులకు తెలిపారు.షాద్ నగర్,కొత్తూర్ మున్సిపాలిటీ అభివృద్ధికి అవసరమైన పనులకు సంబందించిన ప్రతిపాదనలను వెంటనే సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్,అధికారులుస్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## 42 % బీసీ రిజర్వేషన్లను రాజ్యాంగబద్ధంగా అమలు చేయాలి..

### మాజీ ఎమ్మెల్యే వై. అంజయ్య యాదవ్

**ఇందిరాపార్క్ బీసీ ధర్నాకు భారీగా తరలి వెళ్లిన నియోజకవర్గ బీఆర్ఎస్ బీసీ నేతలు ఈట గణేష్, దేవేందర్ యాదవ్**






**ప్రజావినికిడి,(షాద్ నగర్):**రాష్ట్ర ప్రభుత్వం 42 శాతం బీసీ రిజర్వేషన్లను రాజ్యాంగబద్ధంగా పూర్తి స్థాయిలో అమలు చేయాలని మాజీ ఎమ్మెల్యే వై. అంజయ్య యాదవ్ డిమాండ్ చేశారు.బీసీ రిజర్వేషన్లను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర రాజధాని ఇందిరా పార్క్ వద్ద చేపట్టిన మహాధర్నకు నియోజకవర్గంలోని బీసీ బీఆర్ఎస్ నేతలు పెద్ద సంఖ్యలో తరలి వెళ్లారు.ఈ సందర్భంగా అంజయ్య యాదవ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆర్డినెన్స్ పేరుతో బీసీలలో మోసం చేసేందుకు ప్రయత్నిస్తుందని అన్నారు.గతంలో చాలా బిల్లులు అసెంబ్లీలో ప్రవేశపెట్టినప్పటికీ అవి అమలు కాలేదని, ఏ బిల్లు కైనా రాజ్యాంగపరమైన ఆమోదం లభించినప్పుడే అమల్లోకి వస్తుందనే విషయాన్ని బీసీలు గ్రహించాలని కోరారు. ఇటీవల కాలంలో బీసీల రిజర్వేషన్లపై రాష్ట్ర ప్రభుత్వం, కాంగ్రెస్ నేతలు అర్థం లేని ప్రకటనలు చేస్తూ బీసీలను గందరగోళానికి గురి చేస్తున్నారని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం రాజ్యాంగబద్ధంగా బీసీ రిజర్వేషన్లను అమలు చేసి తగిన న్యాయం చేయాలని కోరారు.

## హాజిపల్లిలో ఘనంగా ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం..

**ఎమ్మార్పీఎస్ షాద్ నగర్ నియోజకవర్గ అధ్యక్షుడు పెంటనోళ్ళ రవి కుమార్ మాదిగ ఆధ్వర్యంలో ఎమ్మార్పీఎస్ జెండా ఆవిష్కరణ..**




**ప్రజావినికిడి,(షాద్ నగర్):** షాద్ నగర్ నియోజకవర్గంలోని ఫరుక్ నగర్ మండలం హాజీ పల్లి గ్రామంలో ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు పెంటనోళ్ళ రవి కుమార్ మాదిగ ఆధ్వర్యంలో ఎమ్మార్పీఎస్ జెండా ఆవిష్కరణ ఘనంగా జరిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,మూడు దశాబ్దాల సుదీర్ఘ ఉద్యమాన్ని ప్రజల హృదయాల్లో సజీవంగా నిలిపి రాజ్యంపై రాజీలేని పోరాటాన్ని నడిపి విజయం తెలవని జాతులకు ఘన విజయాన్ని అందించిన ఉద్యమం అణగారిన వర్గాల గొంతుకగా గెలిచి నిలిచినది ఎమ్మార్పీఎస్ అని కొనియాడారు.ఎస్సీ వర్గీకరణ కోసం మందకృష్ణ మాదిగ నేతృత్వంలో మూడు దశాబ్దాలుగా రాజులేని పోరాటం చేసి విజయం సాధించడం జరిగిందన్నారు.ఈ కార్యక్రమంలో ఇసునాతి గంగాధర్, సింగారం సుదర్శన్,ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు బుర్ర రామచంద్రయ్య మాదిగ,జోగు మల్లేష్ మాదిగ చిన్నోళ్ళు అనంతయ్య మాదిగ,జగన్ మాదిగ,సింగారం సుదర్శన్,ఇప్పలపల్లి దర్శన్ మాదిగ, చిన్నగాళ్ల అశోక్ మాదిగ,బుర్ర అంజయ్య మాదిగ,శివకుమార్ మాదిగ,ఇటుకల రాజు,చించేటి కుమార్ మాల,కారుకొండ నవీన్ మాదిగ,కారుకొండ రామయ్య మాదిగ,ఎర్ర శంకరయ్య మాదిగ, కొత్త భీమయ్య, విహెచ్పిఎస్ యాదయ్య,శివకుమార్ మాదిగ,నరసయ్య మాదిగ,పేట శ్రీనివాస్,తదితరులు పాల్గొన్నారు.

## ఓజోన్ హాస్పిటల్స్ లో మాన్సూన్ హెల్త్ చెకప్ ప్యాకేజీ..




**ప్రజావినికిడి,(హైదరాబాద్):** ఓజోన్ హాస్పిటల్స్ లో జూలై 30 తేదీ వరకు నిర్వహించే మాన్సూన్ హెల్త్ చెకప్ ప్యాకేజీ నీ సద్వినియోగం చేసుకోవాలని ఆసుపత్రి యాజమాన్యం తెలిపారు. మంగళవారం ఆసుపత్రి ప్రాంగణంలో హెల్త్ చెకప్ ప్యాకేజీ సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా యాజమాన్యం మాట్లాడుతూ,వర్షాకాలంలో విరామం వచ్చినా,వైరల్ ఫీవర్, జలుబు,జల వ్యాధులు,శ్వాస సంబంధిత సమస్యలు ఎక్కువగాకనిపిస్తాయి.ఈ నేపథ్యంలో,ఓజోన్ హాస్పిటల్స్ అందరికీ అందుబాటులో ఉండే మాన్సూన్ హెల్త్ చెకప్ ప్యాకేజీని రూ.999/- కి ప్రారంభించినట్లు తెలిపారు.ఇది ఆరోగ్యాన్ని ముందుగానే పరిశీలించేందుకు, రోగాలను గుర్తించేందుకు అనువైనదన్నారు. ప్యాకేజీలో సీబీపీ (రక్త పరీక్ష), షుగర్,రక్త గ్రూపింగ్ %డ% టైపింగ్,బ్లడ్ యూరియా,లివర్ ఫంక్షన్ టెస్ట్,లిపిడ్ ప్రొఫైల్,ఛాతి ఎక్స్ రేసీరమ్ క్రియాటినిన్, ఇసిజీ,అల్ట్రాసౌండ్, 2డి ఎకో తో పాటు జనరల్ ఫిజీషియన్, డైటీషియన్ కన్సల్టేషన్ కూడా అందించబడుతుందన్నారు. కుటుంబం కోసం ప్రత్యేక ఆఫర్ గా 4 మందికి కేవలం 3499/- కే అందిస్తున్నట్లు వెల్లడించారు.మరిన్ని వివరాలకు 9533388108 సంప్రదించాలని కోరారు.


MHD
దండోరా
మాదిగ హక్కుల దండోరా,
మరియు దళిత సంఘాల అధ్వర్యంలో
ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ మరియు దివ్యాంగుల సంక్షేమ శాఖ మంత్రివర్యులు
శ్రీ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ గారికి
ఆత్మీయ సన్మానసభ
జూలై 16 (2025) బుధవారం ఉ॥ 11 గం॥లకు
సుప్రభాత్ హోటల్, హబ్సిగూడ, హైదరాబాద్
ఈ కార్యక్రమం లో మాదిగ ప్రజా ప్రతినిధులు, దళిత బహుజన సంఘాల నాయకులు అతిధులుగా పాల్గొంటారు
మంత్రివర్గంలో మాదిగలకు స్థానం కల్పించడంతో పాటు నలుగురు దళిత ప్రతినిధులను మంత్రులుగా చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారికి కాంగ్రెస్ పార్టీకి మా జాతి తరపున హృదయపూర్వక దన్యవాదాలు.
రేగుంట సునీల్ మాదిగ
రాష్ట్ర అధ్యక్షులు
మాదిగ హక్కుల దండోరా
మాతరి రోజరాణి మాదిగ
రాష్ట్రి మహిళా అధ్యక్షురాలు
మాదిగ హక్కుల దండోరా - తెలంగాణ

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక



## కొత్తూరు తహసీల్దార్ కు మైనింగ్ గురించి వినతి పత్రం అందజేసిన వై యం తాండ గ్రామ పంచాయతీ యువకుడు నవీన్ రాథోడ్





**ప్రజావినికిడి,(కొత్తూరు):** మండలంలోని సిద్దపూర్ అదేవిధంగా వైయం తాండ గ్రామం పరిధిలో గల క్వారీలలో సాయంత్రం కాగానే బాంబుల మోత,ప్రజలను తీవ్ర భయాందోళనకు గురిచేస్తోంది.చీకటి పడగానే మొదలయ్యే ఈ పేలుళ్లు, నిత్యకృత్యంగా మారడంతో క్వారీ చుట్టూ ఉన్న గ్రామాలు,తండాల ప్రజలు ప్రతిరోజూ రాత్రి తీవ్ర ఆందోళనతో గడుపుతున్నారు.ఈ బాంబుల శబ్దం,కేవలం చెవులకు మాత్రమే కాదు,భూమిని కూడా కంపింపజేస్తుందని, తమ ఇళ్లు కదులుతున్నాయని చుట్టూ ఉన్న గ్రామ ప్రజలు ఇబందులు పడుతున్నారు.ఈ క్వారీలలో జరుగుతున్న పేలుళ్ల తీవ్రత ఎంతగా ఉందంటే ఇళ్లలో ఉన్న వస్తువులు కింద పడిపోతున్నాయని మరియు చిన్నపిల్లలు, వృద్ధులు ఈ శబ్దాలకు భయపడి తీవ్ర మానసిక ఒత్తిడికి గురవుతున్నారానరు .కావున దీన్ని పై స్పందించి చర్యలు తీసుకోగలరని కోరుకుంటున్నాము.

## బిసి ప్రజా ప్రతినిధులు ఫోరం ఆధ్వర్యంలో చేపట్టిన ధర్నా కార్యక్రమంలో పాల్గొన్న... తెలంగాణ రాష్ట్ర బీసీ కార్యదర్శి విజయ్ కుమార్

**ప్రజావినికిడి,(షాద్ నగర్):** బీసి ప్రజా ప్రతినిధుల ఫోరమ్(బి సిపిఎఫ్) ఆధ్వర్యంలో స్థానిక సంస్థల ఎన్నికలలో చట్టబద్దంగా 42% బీసీ రిజర్వేషన్లు కేటాయించిన తర్వాతనే ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేస్తూ ఇందిరా పార్క్ వద్ద నిర్వహించిన బిసి నాయకుల మహాధర్నా కార్యక్రమంలో పాల్గన్న తెలంగాణ రాష్ట్ర బిసి కార్యదర్శి కేటీఆర్ సేన రంగారెడ్డి జిల్లా ప్రెసిడెంట్ జి.విజయ్ కుమార్ బిసి నాయకులు పాల్గొన్నారు.



## నేటి బాలలే రేపటి పౌరులు

### కాంగ్రెస్ పార్టీ మున్సిపాలిటీ అధ్యక్షుడు జండగూడెం సుదర్శన్ గౌడ్
### కాంగ్రెస్ యువ నాయకుడు పాశం కృష్ణ ఆధ్వర్యంలో చిన్నారులకు సుదర్శన్ గౌడ్ చేతుల మీదగా నోట్ బుక్స్ కిట్ పంపిణీ



**ప్రజావినికిడి,(కొత్తూరు):** నేటి బాలలే రేపటి పౌరులు అని కాంగ్రెస్ పార్టీ మున్సిపాలిటీ అధ్యక్షుడు జండగూడెం సుదర్శన్ గౌడ్ అన్నారు.కొత్తూరు మున్సిపాలిటీ పరిధిలోని స్టేషన్ తిమ్మాపూర్ లోని ప్రైమరీ స్కూల్లో కాంగ్రెస్ పార్టీ యువ నాయకుడు పాశం కృష్ణ ఆధ్వర్యంలో చిన్నారులకు సొంత నిధులతో నోట్ బుక్స్, పలకలు,పెన్నులు,కంబాక్సో ల కిట్లను కాంగ్రెస్ పార్టీ మున్సిపాలిటీ అధ్యక్షుడు సుదర్శన్ గౌడ్ చేతుల మీదగా చిన్నారులకు అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ,ప్రైవేట్ పాఠశాలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యను అందించడం జరుగుతోందని,విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలన్నారు. విద్యా కోసం ఎంత ఖర్చు అయిన ప్రభుత్వం భరిస్తుందన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల యూత్ అధ్యక్షుడు వన్నాడ శివశంకర్ గౌడ్,సిహెచ్ సురేష్ గనిబై,డోలి శ్రీనివాస్,అనుపురం రమేష్,ఇరికిచ్చా జగన్,పాశం అరుణ్, కూన శివకుమార్ గౌడ్, కోటేశ్వర్ గౌడ్,బెస్త మహేష్,పాశం మహేష్,పాశం ఆంజనేయులు,పాశం రమేష్, మంగ సురేష్, వడ్డే రమేష్,కటకే రమేష్,అనుపురం తేజ,పసులాది రాజు, పశులాది సునీత, బెజ్జంకి శారదమ్మ, సతీష్,మొగిలిగిద్ద నరసింహ,స్కూలు ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## ఫ్యూచర్ సిటీ గేమ్ ఛేంజర్

### డిప్యూటి సిఎం భట్టి విక్రమార్క

హైదరాబాద్, **జూలై 15ప్రజావినికిడి:** ఫ్యూచర్ సిటీ తెలంగాణ అభివృద్ధికి గేమ్ ఛేంజర్ అని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వ్యాఖ్యానించారు. మూసీ పునర్జీవనం, రీజనల్ రింగ్ రోడ్డు పూర్తయితే హైదరాబాద్ అభివృద్ధి ఊహకు అందదని ఆయన అన్నారు. తెలంగాణ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ సమావేశంలో డిప్యూటీ-సీఎం భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. ఇది ప్రజల ప్రభుత్వం పారిశ్రామికవేత్తలు ఎప్పుడైనా సీఎం రేవంత్ రెడ్డి, యావత్ కేబినెట్, ఉన్నతాధికారులను సంప్రదించవచ్చని అన్నారు. మా ప్రభుత్వ ద్వారాలు ఎప్పుడూ తెరిచే ఉంటాయని, పెండింగ్ పవర్ బిల్లుల వన్ టైం సెటిల్మెంట్ గురించి ప్రభుత్వం ఆలోచన చేస్తుందన్నారు. ప్రభుత్వం పరిశ్రమలు పౌర సమాజం అంతా కలిసి పని చేద్దాం.. హైదరాబాదులో సృష్టించే సంపదను రాష్ట్రంలోని ప్రతి ఇంటికి తీసుకెళ్దామని, సంపద సృష్టించడం ఒక సాధన మాత్రమే మన ప్రజల గౌరవాన్ని పెంపొందించడం వారి ఆశయాలను నెరవేర్చడం ప్రభుత్వ లక్ష్యమన్నారు



భట్టి విక్రమార్క. తెలంగాణ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ కీ వందేళ్ల పైగా అనుభవం ఉందని, హైదరాబాద్ నగరం ఒక వర్తక నగరం నుంచి ప్రపంచ స్థాయి నగరంగా ఎదిగే వరకు ప్రతి దశలోనూ ముందు నడిచిందన్నారు.

# ప్రజా సమస్యల పట్ల నిర్లక్ష్యమా..?

### అధికారుల తీరుపై అసహనం వ్యక్తం చేసిన మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి.. అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహించిన ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి..

**ప్రజావినికిడి,(బడంగ్పేట్):** మహేశ్వరం నియోజకవర్గంలోని బడంగ్పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని గుర్రంగూడ, మామిడిపల్లి, మల్లాపూర్ గ్రామాల్లో అభివృద్ధి పనులపై మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే శ్రీమతి సబితా ఇంద్రారెడ్డి సమీక్ష సమావేశం నిర్వహించారు.

పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులపై అధికారులను నిలదీశారు.ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై అధికారుల నుంచి స్పందన లేకపోవడంపై ఆమె తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు.ప్రజలు ఇబ్బందులు పడుతుంటే, పనులు నత్తనడకన సాగితే ఎలా సాగుతుంది? బాధ్యతగల వైఖరిని ప్రదర్శించాలి, అంటూ అధికారులను ఆమె హెచ్చరించారు.డ్రైనేజీ వ్యవస్థ,సిసి రోడ్లు ,స్ట్రీట్ లైట్స్, మంచినీటి సరఫరా,



ఎస్ఎన్‌డీపీ నాలా వంటి కీలక అంశాలపై సమగ్రంగా సమీక్షించారు. నాణ్యతకు లోటుపడకుండా, వేగంగా పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని ఆదేశించారు. ఈ సమీక్ష సమావేశంలో బడంగ్పేట్ మున్సిపల్



కమిషనర్ సరస్వతి,డి ఈ వెంకన్న,ఏఈ హరీష్,ఎఒ అరుణ,టి పిఓ కిరణ్,వర్క్ ఇన్స్పెక్టర్లు వినయ్ సంపత్,రాకేష్, కళ్యాణ్,ఎస్పై యాదగిరి,మేనేజర్ నాగేశ్వరరావుతో పాటు ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# జనం స్పందన లేకే.. బూతులు

### : సిఎం రేవంత్ పై జగదీష్‌రెడ్డి ఫైర్

**లేని గొప్పలు చెప్పుకోవడం సిఎం రేవంత్‌రెడ్డికి అలవాటే**

**అసత్యాలతో సంస్కారం లేకుండా మాట్లాడుతున్నారన్నారు**

**నేను రేవంత్ రెడ్డి స్థాయికి దిగజారను**

**తుంగతుర్తి సభలో సిఎం ఎంత మొత్తుకున్నా**

**జనం నుంచి స్పందన లేకపోవడంతో బూతులకు తెగ బడ్డారు**

**మాజీ మంత్రి, బిఆర్ఎస్ ఎంఎల్ఎ జగదీష్‌రెడ్డి**



హైదరాబాద్: **జూలై 15ప్రజావినికిడి:** ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి లేని గొప్పలు చెప్పుకోవడం ఆయనకు అలవాటేనని మాజీ మంత్రి, బిఆర్ఎస్ ఎంఎల్ఎ జగదీష్‌రెడ్డి విమర్శించారు. నానాటికీ ఆయన తన స్థాయి మరిచి మాట్లాడుతున్నారని మండిపడ్డారు. కెసిఆర్ ప్రభుత్వం రేషన్ కార్డులు ఇవ్వలేదని అబద్ధాలు మాట్లాడుతున్నారని అన్నారు. 2021 జులైలో ప్రతి పక్షనేతగా భట్టి విక్రమార్క తన నియోజకవర్గంలో రేషన్ కార్డులు పంచినట్టు అప్పట్లో ట్వీట్ చేశారని, ఇప్పటి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి బిఆర్ఎస్‌లో ఉన్నపుడు రేషన్ కార్డుల పంపిణీ గురించి ప్రత్రికల్లో ప్రకటనలు ఇచ్చారని గుర్తు చేశారు. చౌటుప్పల్‌లో అప్పటి ఎంఎల్ఎ రాజగోపాల్ రెడ్డి సమక్షంలో తాను రేషన్ కార్డులు పంచానని చెప్పుకున్నారని పేర్కొన్నారు.కెసిఆర్ హయాంలో 6.47 లక్షల రేషన్ కార్డులను ఇచ్చామని, తన వాదనను తప్పని నిరూపిస్తే చెంప దెబ్బ కొట్టించుకోవడానికి సిద్ధం అని చెప్పారు. మరి తమ హయంలో రేషన్ కార్డులు పంపిణీ జరగలేదని అంటున్న కాంగ్రెస్ నేతలు చెంప దెబ్బలు తినడానికి సిద్ధమా..? అని ప్రశ్నించారు. తెలంగాణ భవన్‌లో మంగళవారం బిఆర్ఎస్ నేతలు లింగయ్య యాదవ్, గొంగిడి సునీత, ఎన్.భాస్కర్ రావు,రవీంద్ర కుమార్,కె .ప్రభాకర్ రెడ్డి, ఒంటెద్దు నరసింహ రెడ్డిలతో కలిసి ఆయన మీడియా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జగదీష్‌రెడ్డి మాట్లాడుతూ, సిఎం రేవంత్ రెడ్డి అసత్యాలతో సంస్కారం లేకుండా మాట్లాడుతున్నారన్నారని విమర్శించారు. తాను రేవంత్ రెడ్డి స్థాయికి దిగజారను పేర్కొన్నారు. రేషన్ కార్డుల పంపిణీ పేరు మీద తుంగతుర్తిలో ప్రభుత్వ ఖర్చుతో సభకు జనాలను తీసుకొచ్చారని చెప్పారు. సిఎం ఎంత మొత్తుకున్నా సభలో జనం నుంచి స్పందన లేకపోవడంతో బూతులు తిడితేనైనా స్పందిస్తారని సిఎం బూతులకు తెగ బడ్డారని ఆరోపించారు.హామీల పేరుతో సిఎం ప్రజలను మోసం చేస్తున్నారని అన్నారు. నల్లగొండ జిల్లాలో రేవంత్ రెడ్డి రైతాంగాన్ని ఆగమాగం చేశారని, రెండు పంటలను ఎండబెట్టి నిస్సిగ్గుగా అబద్ధాలు మాట్లాడారన్నారని ధ్వజమెత్తారు. ధాన్యం ఉత్పత్తిలో నల్లగొండ జిల్లాను దేశంలోనే నంబర్ వన్‌గా బిఆర్ఎస్ ప్రభుత్వం తీర్చిదిద్దిందని, ధాన్యం ఉత్పత్తిలో 3 లక్షల మెట్రిక్ టన్నుల నుండి 40 లక్షల మెట్రిక్ టన్నుల పెంచిందని చెప్పారు. నల్గొండలో యాదాద్రి పవర్ ప్లాంట్, 3 మెడికల్ కాలేజీలు, యాద్రాది టెంపుల్ అభివృద్ధి కెసిఆర్ హయాంలోనే జరిగాయని తెలిపారు. రేవంత్ హయాంలో ఒక్క ప్రాజెక్ట్ అయినా ప్రారంభించారా..? అని ప్రశ్నించారు. నల్లగొండ రైతులనే అడుగుదాం.. వారి చెంప దెబ్బలకు తాను సిద్ధం అని, మరి సిఎం రేవంత్, మంత్రులు అందుకు సిద్ధమేనా%ా%? అంటూ సవాల్ విసిరారు.

## డెంటిస్ట్ ప్రత్యూష ఆత్మహత్య కేసు

# భర్తతో పాటు కుటుంబ సభ్యుల అరెస్ట్

హన్మకొండ, **జూలై 15ప్రజావినికిడి:** డెంటిస్ట్ ప్రత్యూష ఆత్మహత్య కేసులో ఆమె భర్త సృజన్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితులైన ప్రత్యూష భర్త సృజన్, ఆయన తల్లిదండ్రులు, సృజన్‌తో వివాహేతర సంబంధం పెట్టుకున్న సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్‌ను అరెస్టు చేసినట్లు వెల్లడించారు. ఈ కేసు వివరాలను ఏసీపీ పి.ప్రశాంత్‌రెడ్డి మీడియాకు వెల్లడించారు. సోషల్‌మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్‌తో వివాహేతర సంబంధాన్ని వదిలిపెట్టబోనని భర్త తేల్చిచెప్పడంతోనే డెంటిస్ట్ ప్రత్యూష ఆత్మహత్యకు పాల్పడినట్లు- కాజీపేట పోలీసులు తెలిపారు. ప్రత్యూష-సృజన్ దంపతులకు ఇద్దరు కుమార్తెలున్నారు. వీరి కుటుంబం హసన్‌పర్తిలోని కాకతీయ వింటేజ్ విల్లాస్‌లో స్థిరపడింది. కొన్నాళ్ల క్రితం ఓ ప్రైవేటు- ఆస్పత్రి పబ్లిసిటీ- కోసం యాజమాన్యం సోషల్‌మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్‌ను పిలిపించారు. ఆమెతో సృజన్‌కు ఏర్పడిన పరిచయం వివాహేతర సంబంధానికి దారి తీసింది. అప్పటి నుంచి కుటుంబాన్ని పట్టించుకోని సృజన్.. భార్యను



మానసికంగా, శారీరకంగా వేధిస్తున్నాడు. ఇన్‌ఫ్లూయెన్సర్‌ను వదిలిపెట్టలేనని తేల్చి చెప్పాడు. భర్తతోపాటు అత్తమామలు, ఇన్‌ఫ్లూయెన్సర్ వేధింపులకు గురిచేస్తున్నారు. ఈ క్రమంలోనే ఈనెల 13న సృజన్, ప్రత్యూష మధ్య గొడవ జరిగింది. వివాహేతర సంబంధాన్ని వదిలేయాలని ఎంత చెప్పినా భర్త తన మాట వినకపోవడంతో మనస్తాపానికి గురైన ప్రత్యూష.. అదే రోజు సాయంత్రం గదిలో ఫ్యాన్‌కు చీరతో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. భార్య ఎంతసేపటికీ గది నుంచి బయటకు రాకపోవడంతో సృజన్ కిటికీ నుంచి చూడగా.. ప్రత్యూష ఉరివేసుకోవడం కనిపించింది. వెంటనే తన స్నేహితులకు సమాచారం అందించిన సృజన్.. వారి సాయంతో ప్రత్యూషను ఓ ప్రైవేటు- ఆస్పత్రికి తీసుకెళ్లాడు. అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు నిర్ధరించారు. ఈ ఘటనపై హసన్‌పర్తి పోలీస్ స్టేషన్‌లో ప్రత్యూష తల్లి సోమవారం ఫిర్యాదు చేశారు. ప్రత్యూష మరణించడంతో భర్త సృజన్, అత్తమామలు, ఇన్‌ఫ్లూయెన్సర్ పోలీసుల కంట కనిపించకుండా తప్పించుకొని తిరిగారు. కాకతీయ వింటేజ్ విల్లాస్ వద్ద పోలీసులు గస్తీ కాస్తున్న విషయం తెలియక మంగళవారం ఉదయం ఆ నలుగురు కారులో అక్కడికి చేరుకున్నారు. దీంతో పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు. వారిని న్యాయమూర్తి వద్ద ప్రవేశపెట్టి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు. అయితే ఆమె ఒంటిపై గాయాలు ఉన్నాయని, వారే హత్య చేశారని ప్రత్యూష తల్లిదండ్రులు ఆరోపించారు.

## మెదక్ జిల్లా కాంగ్రెస్ నేత హత్య

మెదక్ **జూలై 15ప్రజావినికిడి:** మెదక్ జిల్లా కొల్చారం మండలం పైతరకు చెందిన కాంగ్రెస్ యువనేత మారెల్లి అనిల్ (35) అనుమానాస్పద రీతిలో మృతిచెందాడు. అతని కుడి భుజం నుంచి రెండు బుల్లెట్లు- దూసుకెళ్లినట్లు పోలీసులు తెలిపారు. అయితే ప్రత్యర్థులు ఆయనను కాల్చి చంపినట్లు తెలుస్తోంది. రియల్ వ్యవహారంలో ఈ ఘటనజరిగిందన్న అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. శవపరీక్ష కోసం అనిల్ మృతదేహాన్ని మెదక్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా



వ్యవహరిస్తున్న అనిల్ తొలుత రోడ్డు ప్రమాదంలో మృతిచెందినట్లు- ప్రకటించారు. పెట్రోలు బంక్ నిర్వహిస్తున్న అనిల్.. సోమవారం రాత్రి మెదక్ నుంచి స్వగ్రామానికి కారులో బయల్దేరాడు. ఇదే మండలం చిన్నఘనపూర్ విద్యుత్తు ఉపకేంద్రం వద్ద కారు అదుపు తప్పి కల్వర్టుకు వాహనం ఢీకొట్టింది. దీంతో కారు పొలాల్లోకి దూసుకెళ్లింది. అనిల్‌కు తీవ్రగాయాలు కావడంతో అక్కడున్న వారు గమనించి మెదక్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ అతడు మృతి చెందాడు. అయితే పోలీసులు ఘటనాస్థలాన్ని పరిశీలించగా బుల్లెట్ల విషయం వెలుగులోకి వచ్చింది. ప్రత్యర్థులు కారు ఆపి తుపాకీతో కాల్చినట్లు ప్రచారం సాగుతోంది.

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక



# దేశవ్యాప్తంగా ఓటర్ల సమగ్ర సవరణ

## పలు సూచనలు చేస్తూ టిడిపి వినతిపత్రం -ఢిల్లీలో ఇసిని కలిసిన పార్టీ నేతలు

న్యూఢిల్లీ, **జూలై 15ప్రజావినికిడి:** సుప్రీంకోర్టు మార్గదర్శకాలతో అన్ని పార్టీల సూచనలు తీసుకుంటున్నామని కేంద్ర ఎన్నికల సంఘం తెలిపింది. బీహార్‌లో ఈసీ సంస్కరణలను టీడీపీ బృందం స్వాగతించింది. గంట సేపు కేంద్ర ఎన్నికల కమిషనర్‌లతో టీడీపీ నేతలు చర్చించారు. ఆగస్టు - జనవరి మధ్య ఏపీలో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ జరుగనుందని సీఈసీ తెలిపారు. ఓటర్ల జాబితా పారదర్శకంగా రూపొందించాలని పార్టీ ఎంపి లావు శ్రీకృష్ణదేవరాయలు కోరారు. అపోహలకు చోటులేకుండా సంస్కరణలు అమలు చేయాలని సూచించారు. ప్రత్యేక యాప్ ద్వారా ఓటరు జాబితా సవరణ చేయాలని శ్రీకృష్ణదేవరాయలు కోరారు. కేంద్ర ఎన్నికల సంఘం త్వరలో దేశ వ్యాప్తంగా ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ నిర్వహించనున్న నేపథ్యంలో సీఈసీకి తెలుగుదేశం పార్టీ 7 సూచనలు చేసింది. దిల్లీలో సీఈసీని కలిసిన తెదేపా నేతల బృందం ఈమేరకు పార్టీ తరఫున వినతిపత్రం అందించింది. ఎస్ఐఆర్‌ను ఏపీలో అమలు చేసేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ధ్రువపత్రాల విషయంతో పాటు- ఓట్ల తొలగింపుపై ప్రజల్లో నెలకొన్న అపోహలపై సందేహాలను లేవనెత్తింది. ఎస్ఐఆర్ వల్ల



ఎలాంటి నష్టం వాటిల్లదని, ఎవరి ఓట్లు- తొలగించబోమని ఎన్నికల సంఘం స్పష్టం చేసిందని తెదేపా నేతలు తెలిపారు. తెదేపా ఏపీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, లావు శ్రీకృష్ణదేవరాయలు, కూన రవికుమార్ తదితరులు సీఈసీని కలిసిన వారిలో ఉన్నారు. ఓటర్ల జాబితా ధ్రువీకరణను బలోపేతం చేయాలని,కాగ్ ఆధ్వర్యంలో ఏడాదికోసారి థర్డ్ పార్టీ ఆడిట్ నిర్వహించాలి. ఓటర్ల జాబితా రూపొందించడంలో ఏఐ సాయం తీసుకోవాలని టిడిపి సూచించింది.ఆధార్ సహాయంతో నకిలీ ఎపిక్ నంబర్లను గుర్తించాలని,. ఇంక్ ఆధారిత ధ్రువీకరణ స్థానంలో బయోమెట్రిక్ వెరిఫికేషన్ పక్రియను అమలు చేయాలన్నారు. ఓటర్ల జాబితా సవరణలో అన్ని గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల బూత్ లెవల్ ఏజెంట్లను భాగస్వాములను చేయాలి. డ్రాఫ్ట్ రోల్స్‌ను ముందస్తుగా బీఎల్ఏలతో పంచుకోవడాన్ని తప్పనిసరి చేయాలని కోరింది. ఓటర్ల చేర్పులు, తొలగింపులకు సంబంధించి జిల్లాల వారీ డేటాను కేంద్ర ఎన్నికల సంఘం వెబ్‌సైట్‌లో అందుబాటు-లో ఉంచాలి.. దీనివల్ల పారదర్శకతతో పాటు- ప్రజలు సులభంగా చెక్ చేసుకోవచ్చని తెలిపారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఎన్నికల సిబ్బందిపై చట్టపరంగా చర్యలు తీసుకోవడం, జరిమానాలు విధించడం చేయాలి. స్థానిక పరిస్థితుల ప్రభావం ఎన్నికలపై పడకుండా బీఎల్‌వోలు, ఈఆర్వోలను తరచూ మారుస్తుండాలని అన్నారు. వలసదారులు, గిరిజన తెగలకు చెందిన వారు, నిరాశ్రయులైన వారి పేర్లను తిరిగి ఓటర్ల జాబితాలో చేర్చేలా చర్యలు తీసుకోవాలి. దీనికోసం ప్రత్యేక శిబిరాలు నిర్వహించాలని టిడిపి తెలిపింది. ఓటర్ల జాబితాపై సంప్రదింపులు, పర్యవేక్షణకు ప్రతి నెలా గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలతో జిల్లా, నియోజకవర్గ ఎన్నికల అధికారులు సమావేశాలు నిర్వహించాలనికూడా నేతలు సూచించారు.

# నేటి జలశక్తి మంత్రి భేటీ ఉంటుందా?

**జలవివాదాలపైనే తెలంగాణ ఫోకస్**

**బనకచర్లపై ఎపి ప్రభుత్వం పట్టు**

**తెలంగాణ లేఖతో సమస్య జటిలం**



న్యూఢిల్లీ/హైదరాబాద్, **జూలై 15ప్రజావినికిడి:** ఎన్‌డిఎలో భాగస్వామిగా ఉన్న చంద్రబాబు కేంద్రంపై పరోక్షంగా ఒత్తిడిపెంచి ఒక్కో పనిని సానుకూలం చేసుకుంటున్నారు. ఈక్రమంలో బనకచర్లపై తెలంగాణను ఒప్పించేందుకు కేంద్రంతో భేటీ ఏర్పాటు చేయించారు. ఈ క్రమంలో బనకచర్లపై నేరుగా చర్చ అని చెప్పకుండా జలవివాదాలపై అంటూ..కేంద్రమంత్రి పాటిల్ ఇరు రాష్ట్రాల సిఎంల భేటీకి నేడు ఆహ్వానించారు. అయితే ఈ ఎత్తుగడను ముందే పసిగట్టిన తెలంగాణ ఈ భేటీలో జలవివాదాలు తప్ప బపనకచర్లపై చర్చుండరాదని మెలికపెట్టి లేఖ రాసింది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌ల మధ్య నెలకొన్న జల వివాదాల పరిష్కారంలో కృష్ణా, గోదావరి జలాల గురించి మాత్రమే చర్చించాలని కేంద్రానికి తెలంగాణ ప్రభుత్వం స్పష్టం చేసింది. ఇది చేయకుండా కేవలం బనకచర్లపై చర్చించడం కుదరదని తేల్చిచెప్పింది. దీంతో కేంద్రం ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రులను చర్చకు ఆహ్వానించిన క్రమంలో ఈ సమావేశం ఉంటుందా లేదా అన్నది అనుమానంగా మారింది. ఇరు రాష్ట్రాల మధ్యజలవివాదాల పరిష్కారం కోసం అంటూ బుధవారం తెలంగాణ, ఎపి సిఎంలు కేంద్ర జల్‌శక్తి శాఖ మంత్రి సిఆర్ పాటిల్‌తో సమావేశం కానున్నట్లు ప్రకటించారు. ఈ నేపథ్యంలో కేంద్రానికి తెలంగాణ సర్కార్ లేఖ రాసింది. సమావేశంలో బనకచర్లపై చర్చించాలని ఎపి సింగిల్ ఎజెండా ఇచ్చింది. అయితే నేటి భేటీలో బనకచర్లపై చర్చ అవసరం లేదని తెలంగాణ ప్రభుత్వం తన లేఖలో పేర్కొంది. కృష్ణాపై పెండింగ్ ప్రాజెక్టులకు అనుమతులను ప్రభుత్వం అజెండాగా ప్రతిపాదించింది. పాలమూరు, డిండి ప్రాజెక్టులకు జాతీయహోదాను ప్రభుత్వం అజెండాగా పంపించింది. ఇచ్చంపల్లి ప్రాజెక్టును కేంద్రం చేపట్టాలని ప్రభుత్వం కోరింది. గోదావరి-బనకచర్ల ప్రాజెక్టుపై చర్చించేందుకు కేంద్ర జలశక్తి శాఖ నుంచి తెలుగు రాష్ట్రాల సీఎంలకు పిలుపు వచ్చిన నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం కేంద్రానికి లేఖ రాసింది. ఏపీ ఇచ్చిన బనకచర్ల అజెండాపై అభ్యంతరం తెలిపింది. కేంద్రమంత్రి సీఆర్ పాటిల్ అధ్యక్షతన జరిగే నేటి సమావేశంలో బనకచర్లపై చర్చ అవసరం లేదని తెలంగాణ ప్రభుత్వం స్పష్టం చేసింది. గోదావరి-బనకచర్ల ప్రాజెక్టు విషయమై ఆంధప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల ముఖ్యమంత్రులు చంద్రబాబునాయుడు, రేవంత్‌రెడ్డిలతో కేంద్ర జలశక్తిశాఖ మంత్రి సీఆర్ పాటిల్ ఈ నెల 16న బుధవారం సమావేశం కావాలని నిర్ణయించారు. ఈ మేరకు జలశక్తిశాఖ ఇరు రాష్ట్రాలసీఎంల కార్యాలయాలు, సీఎస్‌లకు సమాచారం పంపించింది. దిల్లీలోని జలశక్తిశాఖ ప్రధాన కార్యాలయం శ్రమశక్తి భవన్‌లో మధ్యాహ్నం 2.30 గంటలకు సమావేశం జరుగుతుంది. ఈ అంశంతోపాటు- రాష్ట్రాల తరఫున మాట్లాడాల్సిన ఇతర ఎజెండా పాయింట్లు- ఏమైనాఉంటే వెంటనే పంపాలని జలశక్తిశాఖ కోరింది. సమావేశంలో బనకచర్లపై చర్చించాలని ఏపీ ప్రభుత్వం సింగిల్ అజెండా ఇచ్చింది. వాస్తవానికి ఈ నెల 11న సమావేశం నిర్వహించాలని నిర్ణయించి ముఖ్యమంత్రుల సమయం కోరినా, సానుకూల స్పందన రాకపోవడంతో 16వ తేదీకి వాయిదావేశారు. ఈ తేదీన హాజరుకావడానికి ఇద్దరు ముఖ్యమంత్రులు అంగీకరించినట్లు- తెలిసింది. కృష్ణా నదిపై పెండింగ్ ప్రాజెక్టులకు అనుమతులను అజెండాగా ప్రతిపాదించింది. పాలమూరు, దిండి ప్రాజెక్టులకు జాతీయహోదా, ఇచ్చంపల్లి ప్రాజెక్టును కేంద్రం చేపట్టాలని, తుమ్మడిహెట్టి వద్ద ప్రాణహిత ప్రాజెక్టుకు 80 టీఎంసీలు కేటాయించాలని అజెండాగా పంపించింది. 200 టీఎంసీల వరద జలాల వినియోగానికి కొత్త ప్రాజెక్టు నిర్మించాలని తెలంగాణ ప్రభుత్వం ప్రతిపాదించింది. బనకచర్లకు ఎలాంటి అనుమతులు లేవని, చట్టాలు, -ట్రైబ్యునల్ తీర్పుల ఉల్లంఘన జరుగుతోందని లేఖలో ప్రస్తావించింది. గోదావరి-బనకచర్ల లింక్ ప్రాజెక్టుపై చర్చించడం అనుచితమని పేర్కొంది. ఇలాంటి చర్యలతో కేంద్ర ప్రభుత్వ నియంత్రణ సంస్థలపై నమ్మకం పోతుందని తెలిపింది. ఏపీ పునర్విభజన చట్టం మేరకు కొత్త ప్రాజెక్టులు, జల వివాదాలకు సంబంధించిన అంశాలను కేంద్ర జలశక్తి మంత్రి ఛైర్మన్‌గా, రెండు రాష్ట్రాల సీఎంలు సభ్యులుగా గల ఎపెక్స్ కౌన్సిల్‌లో చర్చించాల్సి ఉంది. గత పదేళ్లలో రెండు సమావేశాలు జరిగాయి. ఇటీవల ఏపీ ప్రభుత్వం గోదావరి వరద జలాలను వినియోగించు కొనేందుకు బనకచర్ల ప్రాజెక్టును ప్రతిపాదించింది. ఈ ప్రాజెక్టును తెలంగాణ ప్రభుత్వం తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. సీఎం రేవంత్‌రెడ్డి, నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ ఇప్పటికే దిల్లీలో కేంద్రమంత్రిని కలిసి అభ్యంతరం వ్యక్తంచేశారు. పర్యావరణ అనుమతులు, కేంద్ర జలసంఘం నుంచి అనుమతులు ఇవ్వొద్దంటూ లేఖలు రాశారు. గోదావరి-బనకచర్ల వల్ల తెలంగాణలోని ప్రాజెక్టులకు అన్యాయం జరుగుతుందని తెలంగాణ గట్టిగా వాదన వినిపిస్తున్న నేపథ్యంలో కేంద్రమంత్రితో జరిగే సమావేశం ప్రాధాన్యం సంతరించుకొంది. అయితే తాజా పరిణామాల నేపథ్యంలో ఈ భేటీ ఉంటుందా అన్న అనుమానాలు వస్తున్నాయి.

# కేరళ నర్స్ నిమిషకు భారీ ఊరట

## యెమెన్‌తో కేంద్రం చర్చలు ఫలవంతం -ఉరి అమలు తాత్కాలికంగా వాయిదా

న్యూఢిల్లీ, **జూలై 15ప్రజావినికిడి:** యెమెన్‌లో కేరళ నర్సు నిమిష ప్రియకు భారీ ఊరట దక్కింది. యెమెన్ ప్రభుత్వం చివరిక్షణంలో ఉరిశిక్ష అమలును వాయిదా వేసింది. ప్రస్తుతం యెమెన్ ప్రభుత్వంతో కేంద్రం చర్చలు కొనసాగుతున్నది. కేంద్ర ప్రభుత్వం అన్ని రకాలుగా ఆమెను రక్షించేందుకు ప్రయత్నిస్తుంది. ఎట్టకేలకు ఆ ప్రయత్నాలు ఫలించడంతో బుధవారం అమలు కావాల్సిన ఉరిశిక్ష తాత్కాలికంగా వాయిదా పడింది. ఆమె మరణశిక్ష అమలును యెమెన్ వాయిదా వేసినట్లు భారత విదేశాంగ శాఖ వర్గాలు వెల్లడించాయి. గతంలో నిర్ణయించిన ప్రకారం.. జులై 16న ఈ శిక్ష అమలుచేయాల్సి ఉండగా.. చివరి క్షణంలో స్థానిక అధికారులు దీన్ని నిలిపివేసినట్లు- సమాచారం. ఈ కేసు మొదలైనప్పటి నుంచి నిమిష ప్రియకు అన్నివిధాలా సాయం చేసేందుకు భారత ప్రభుత్వం ప్రయత్నిస్తూనే ఉంది. నిమిష కుటుంబం.. బాధిత కుటుంబం పరస్పర అంగీకారానికి వచ్చి కేసును పరిష్కరించుకునేలా కొంత సమయం ఇచ్చేలా ప్రయత్నాలు చేశాం. స్థానిక జైలు అధికారులు, ప్రాసిక్యూటర్ ఆఫీసుతో నిరంతరం సంప్రదింపులు జరిపాం. అవి ఫలించి మరణశిక్ష అమలును వాయిదా వేసేందుకు యెమెన్ అధికారులు అంగీకారం తెలిపారని విదేశాంగ శాఖ వర్గాలు వెల్లడించాయి.



ఈ కేసులో బ్లడ్ మనీ తీసుకునేలా బాధిత కుటుంబాన్ని ఒప్పించేందుకు మత గురువు కాంతాపురం ఏపీ అబూబకర్ ముస్లియార్ సంప్రదింపులు జరిపిన సంగతి తెలిసిందే. ఆ చర్చలు కూడా సానుకూలంగా జరుగుతున్నట్లు సమాచారం. బాధిత కుటుంబానికి ఒక మిలియన్ డాలర్ల (దాదాపు రూ. 8.6కో) క్షమాధనాన్ని ఇచ్చేందుకు నిమిష ప్రియ కుటుంబం సిద్ధమైంది. ఇందుకు వారు అంగీకరిస్తే.. నిమిష ప్రియకు మరణశిక్ష తప్పే అవకాశం ఉంది.ఉరికి కేవలం కొన్ని గంటలు మాత్రమే మిగిలి ఉన్న క్రమంలో మోడీ సర్కార్ చేసిన ప్రయత్నాలు ఫలించి ఉరితీతు తాత్కాలికగా వాయిదా వేశారు. నిమిష కుటుంబం మాత్రం నిమిషను రక్షించుకోవడానికి ప్రయత్నాలు చేస్తూనే ఉంది. ఉన్న ఒకదారి అగమ్యగోచరంగా మారింది. హతుడి కుటుంబం అడిగినంత డబ్బు ఇవ్వగలిగితే.. చివరి నిమిషంలోనైనా నిమిషకు ఉరి తప్పే అవకాశం ఉంది. కొన్ని నెలల క్రితమే నిమిష ప్రియ కుటుంబం బ్లడ్ మనీ కింద 10 లక్షల డాలర్లు సిద్ధం చేసుకుంది. అయితే, నిమిష కుటుంబానికి, హతుడి కుటుంబానికి మధ్యవర్తిత్వం వహించిన లాయర్ దెబ్బ కొట్టాడు. పెద్ద మొత్తంలో ఫీజు డిమాండ్ చేశాడు. తన ఫీజు చెల్లించే వరకు బ్లడ్ మనీ చర్చలు జరపనని తేల్చి చెప్పాడు. దీంతో ఎప్పుడో పూర్తి కావాల్సిన బ్లడ్ మనీ వాయిదా పడింది. ప్రస్తుతం నిమిష ప్రియ కుటుంబం తరపున శామ్యుయెల్ జెరోమ్, షేక్ హబీబ్ హుమర్‌లు మధ్యవర్తిత్వం వహిస్తున్నట్లు సమాచారం. 10 లక్షల డాలర్లు వెంటనే ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నామని నిమిష కుటుంబం.. హతుడి కుటుంబానికి చెప్పిందని సమాచారం. అయితే, మృతుడి కుటుంబం మాత్రం బ్లడ్ మనీ విషయంలో ఇంకా ఎలాంటి సమాధానం చెప్పలేదని తెలుస్తోంది. ఉరికి గంటల ముందు హతుడి కుటుంబం బ్లడ్ మనీకి ఒప్పుకుంటుందా అన్నది ఓ పెద్ద ప్రశ్నగా మారింది. ఈ క్రమంలో కేంద్రం తీసుకున్న చర్యలకారణంగా ఉరిని యెమెన్ పాలకులు వాయిదా వేశారు. దీంతో బ్లడ్ మనీ చర్చలకు మరోమారు అవకాశం ఏర్పడింది.

# చేపలవేటలో శిక్షణ

## దరఖాస్తులకు ఆహ్వానం

విజయవాడ, **జూలై 15ప్రజావినికిడి:** బాదంపూడిలో గల దేశీయ జల మత్స్య సంవర్ధన శిక్షణా కేంద్రంలో చేపల వేటలో శిక్షణ ఇవ్వనున్నారు. శిక్షణ పొందే అభ్యర్థులు తమ పేరు, చిరునామా, పుట్టిన తేదీ విద్యార్హతలు అనుభవము మొదలగు వివరాలు తెలుపుతూ ధరఖాస్తులను ఈ నెల 25వ తేదీలోగా సమర్పించాలి. దీనిని మత్స్యశాఖ సహాయ సంచాలకులు, బాదంపూడి, ఉంగుటూరు మండలం, ఏలూరు జిల్లా వారికి చేరే విధంగా పంపవలసిందిగా జిల్లా మత్స్య శాఖ అధికారి బి. నరసయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ?శిక్షణ పొందుటకు ఆంధ్రప్రదేశ్ కోస్తా జిల్లాలోని, మత్స్యకారులు, యువకులు, జాలరులు, సహకార సంఘముల సభ్యులు చేపల పెంపకం నందు ఆసక్తి కలిగిన ఇతరులు, షెడ్యూల్డ్ కులములు మరియు షెడ్యూల్డ్ తెగలకు చెందిన వారు అర్హులు. ఉపకార వేతనము లేకుండా 20 సీట్లు కలవు, ఇంటర్వ్యూలు 29 న ఉదయం 11.00 గంటలకు మత్స్య శాఖ సహాయ సంచాలకులు, బాదంపూడి వారి కార్యాలయములో నిర్వహించబడును. ఇంటర్వ్యూలో ఎంపికైన వారి పేర్లు అదే రోజు సాయంత్రం 4.00 గంటల తర్వాత కార్యాలయము నోటీసు బోర్డులో ఉంచుతారు. మూడు మాసముల శిక్షణా కాలము ఆగస్ట్ 1నుండి అక్టోబర్ 31 వరకు ఉంటుంది. శిక్షణా కాలములో మత్స్య క్షేత్రములు మరియు రిజర్వాయర్లల్లో చేపలు పెంపకము గురించి బోధన మరియు ప్రాక్టికల్ తో కూడిన కోర్సు భోదించబడును. శిక్షణాంతరము పరీక్షలు నిర్వహించి, ఉత్తీర్ణులైన విద్యార్థులకు సర్టిఫికెట్లు- అందించబడును. 5 వ తరగతి ఆ పైన చదువుకున్న వారికి ప్రాదాన్యత, తెలుగులో చదడం, రాయడం తెలిసిన వారికి కూడా అవకాశము ఇవ్వబడుతుంది. 18-30 సంవత్సరములు మధ్య వయస్సు గల వారు అర్హులు, వారి అర్హతలు ఎంపిక కమిటీ- ప్రత్యేక పరిగణనలో వయస్సు పరిమితిని సడలించవచ్చును. సహాయ పరిశీలకులు మత్స్యశాఖ హోదాకు తగ్గకుండా మత్స్యశాఖ అధికార్ల నుండి పొందిన అనుభవం గల సర్టిఫికెట్లు- దరఖాస్తుతో జతపరిచి పంపవలయును. అభ్యర్థి బయోడేటాలు స్వదస్తూరి లేదా -టైప్ చేసిన దరఖాస్తులు గానీ 25వ తేదీ లోగా కార్యాలయానికి పంపాలి..

# ఉక్కు పరిశ్రమల ఏర్పాటుకు అడుగేయాలి

## నిరుద్యోగ యువతకు భరోసా కల్పించాలి

కడప, **జూలై 15ప్రజావినికిడి:** స్థానిక వనరులతో పరిశ్రమలు స్థాపిస్థే తప్ప దేశంలో లక్షలాదిగా ఉన్న నిరుద్యోగ యువతకు ఉపాధి దక్కదు. కడప, బయ్యారం ఉక్కు కర్మాగారాల ఏర్పాటు విషయంలో మరోమారు ఆలోచన చేయాల్సిఉంది. అలాగే స్థానికంగా లభ్యమవుతున్న ముడిసరుకుని విదేశాలకు తరలించకుండా అడ్డుకోవాలి. కడప, బయ్యారం ఉక్కు కర్మాగారాల ఏర్పాటు సాధ్యం చేయాల్సిన అవసరం ఉంది. ఇంకా కాలయాపన చేయడం వల్ల ఎందరో యువత ఆశలను దెబ్బతీశారు. అనంతపురం, కడప, కర్నూలు జిల్లాల్లో అపారమైన ఇనుప ఖనిజ నిల్వలున్నాయనీ, అనంతపురం గనుల ఖనిజం నాణ్యత ఎక్కువనీ మెకాన్ సంస్థగతంలోనే నిర్ధారించింది. కడప ఉక్కు కర్మాగారానికి ఆ ఖనిజ నిక్షేపాలను కేటాయిస్తామని రాష్ట్ర ప్రభుత్వం సంసిద్ధతనూ తెలిపింది. వీటన్నిటి ఆధారంగా కడప ఉక్కు కర్మాగార ఏర్పాటు సాధ్యమేనని మెకాన్ సంస్థ సమర్పించిన ప్రాథమిక నివేదికలో పేర్కొంది. ఇలాంటి విషయాల్లో కాలయాపన చేసి చివరికి చేతులెత్తేయడం ద్వారా బృహత్తర లక్ష్యాన్ని దెబ్బతీయడం కాకా మరోటి కాదు. ఇలా చేయడం ద్వారా నిరుద్యోగ యువతకు ఉన్న అవకాశాలను దెబ్బతీయడం తప్ప మరోటి కాదు. సామాన్య ప్రజలనేగాక న్యాయ వ్యవస్థనూ మోడీ సర్కారు పక్కదారి పట్టించందనే అనుకోవాలి. కడప ఉక్కు విషయంలో మోసాన్ని రాష్ట్ర ప్రజలు ముక్త కంఠంతో నిరసిస్తున్నారు. కడప ఉక్కుపట్ల కేంద్రం ఎంత ప్రతికూలంగా వుందో స్పష్టమవుతోంది. వెనుకబడిన రాయలసీమ, ఉత్తరాంధ్ర జిల్లాలకు ప్రత్యేక నిధులు మూడేళ్లు మాత్రమే ఇచ్చి, తర్వాత నిలిపివేసింది. పోర్టు ఏర్పాటుకూ తిలోదకాలిచ్చింది. సంకుచిత స్వార్థ రాజకీయ ప్రయోజనాలకు విరుద్దంగా అభివృద్ధి సాగాలి. అప్పుడే ఉక్కు పరిశ్రమల ఏర్పాటు సాకారం కాగలదని స్థానిక లెఫ్ట్ నేతలు వాదిస్తున్నారు.

# వైకాపా ఎంపి మిథున్ రెడ్డికి షాక్

## ముందస్తు బెయిల్ పిటిషన్ తిరస్కరణ



అమరావతి **జూలై 15ప్రజావినికిడి:** మద్యం కేసులో వైకాపా ఎంపీ మిథున్‌రెడ్డికి హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. ఆయన దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్‌ను ఉన్నత న్యాయస్థానం కొట్టివేసింది. ఈ కేసులో మిథున్‌రెడ్డి ఏ4 నిందితుడిగా ఉన్నారు. రాష్ట్రంలో మద్యం ఆర్డర్లు, సరఫరా వ్యవస్థ గతంలో ఆన్‌లైన్ పద్ధతి ద్వారా పారదర్శకంగా ఉండేదని, వైకాపా ప్రభుత్వ హయాంలో దానిని మాన్యువల్ విధానంలోకి తీసుకురావడంలో ఆ పార్టీ ఎంపీ మిథున్‌రెడ్డి కీలక పాత్ర పోషించారని సీఐడీ తెలిపింది. తనను పోలీసులు అరెస్ట్ చేయకుండా ఉండేందుకు ముందస్తు బెయిల్ కోసం మిథున్ రెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. అయితే, ఆ పిటిషన్ పై కీలక నిర్ణయం తీసుకున్న ధర్మాసనం.. మిథున్ రెడ్డి బెయిల్ పిటీషన్ ను డిస్మిస్ చేసింది. మద్యం కుంభకోణం విచారణ కీలక దశలో ఉన్నందున ఇప్పుడు బెయిల్ ఇవ్వడం సాధ్యం కాదని స్పష్టం చేసింది. దీంతో త్వరలో ఈ కేసులో మిథున్ రెడ్డిని పోలీసులు అరెస్ట్ చేసే అవకాశం ఉన్నట్లు- తెలుస్తోంది.

-------

# భిన్నత్వంలో ఏకత్వమే మన విధానం

## జాతీయ సమగ్రత, భాషా సామరస్యం ముఖ్యం

## పవన్ హిందీ భాషా వ్యాఖ్యలపై జనసేన వివరణ

అమరావతి, **జూలై 15ప్రజావినికిడి:** భిన్నత్వంలో ఏకత్వం, జాతీయ సమగ్రత, భాషా సామరస్యంపై జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆలోచన విధానమని జనసేన స్పష్టం చేసింది..హైదరాబాద్‌లో నిర్వహించిన రాజ్యభాష విభాగం స్వర్ణోత్సవ వేడుకల్లో జనసేన అధినేత, ఏపీ డిప్యూటీ- సీఎం పవన్ కల్యాణ్ చేసిన వ్యాఖ్యలపై పెద్ద ఎత్తున విమర్శలు వచ్చాయి.. అయితే, దీనిపై జనసేన పార్టీ స్పందించింది.. మాతృభాషకు ప్రథమ ప్రాధాన్యత.. సమాజంలో మన గుర్తింపుకు మూలం మాతృభాషే అని స్పష్టం చేసింది జనసేన. బాల్యంలో విద్యాభ్యాసానికి, మన సంస్కృతులను కాపాడుకోవడానికి మాతృభాష తప్పనిసరిగా ఉండాలన్నది పవన్ అభిప్రాయమని తెలిపింది. బహుభాషా ప్రావీణ్యం జీవితంలో ఎదిగేందుకు ఒక సాధనం అని పేర్కొన్నారు.. అది జ్ఞానాన్ని అందించడమే కాకుండా, భిన్న సంస్కృతుల ప్రజలతో మమేకం అయ్యేందుకు, అవకాశాలను మెరుగుపరచేందుకు తోడ్పడుతుందని పేర్కొంది. అన్ని భాషలను గౌరవించాలి.. ఏ భాషను బలవంతంగా రుద్దవద్దని పవన్ కల్యాణ్ అన్నారని జనసేన స్పష్టం చేసింది. ప్రతీ భాషకు సముచిత గౌరవం ఇవ్వటం కనీస బాధ్యత. భాషను గౌరవిస్తూ, అది ప్రజలను కలిపే వారధిగా పనిచేస్తుందని పార్టీ స్పష్టం చేసింది. భాషను బలవంతంగా రుద్దితే అది ప్రజలను విడదీస్తుందన్న అభిప్రాయాన్ని వెల్లడించింది. హిందీని బలవంతంగా రుద్దడం లేదు.. కానీ, హిందీ వల్ల ప్రయోజనాలు అనేకం అని తెలిపింది. హిందీ భాషను ఖచ్చితంగా నేర్చుకోవాలనే విధానానికి పవన్ కల్యాణ్ ఎప్పుడూ వ్యతిరేకమే. అయితే, ఉద్యోగ అవకాశాల కోసం, విభిన్న ప్రాంతాల ప్రజలతో మమేకం అయ్యేందుకు హిందీని నేర్చుకోవడం వల్ల ఫలితాలే తప్ప నష్టం ఏమీ లేదని పార్టీ పేర్కొంది. భిన్నత్వంలో ఏకత్వమే భారతదేశ అస్తిత్వం. భాషా వైవిధ్యాన్ని అర్థం చేసుకోవడం ద్వారా భారతదేశం మరింత సమగ్రాభివృద్ధిని సాధించగలదని, ఫెడరల్ స్ఫూర్తిని కాపాడగలదని పవన్ కల్యాణ్ అభిప్రాయం అని జనసేన తెలిపింది..

---------

# క్రికెటర్ యశ్ దయాల్‌ను అరెస్టు చేయకండి. స్టే ఇచ్చిన అలహాబాద్ హైకోర్టు



ప్రయాగ్‌రాజ్: క్రికెటర్ యశ్ దయాల్‌కు ఊరట లభించింది. అతన్ని అరెస్టు చేయవద్దు అని అలహాబాద్ హైకోర్టు స్టే ఇచ్చింది. ఓ మహిళను లైంగికంగా వేధించినట్లు ఆ ఐపీఎల్ క్రికెటర్‌పై కేసు నమోదు అయిన విషయం తెలిసిందే. ఐపీఎల్‌లో ఆర్సీబీ తరపున యశ్ దయాల్ ఆడుతున్నాడు. తదుపరి విచారణ వరకు అతనిపై ఎటువంటి చర్యలు తీసుకోవద్దు అని కోర్టు తన ఆదేశాల్లో పేర్కొన్నది. ఈ విషయాన్ని అతని తరపు న్యాయవాది గౌరవ్ త్రిపాఠి పేర్కొన్నారు.జస్టిస్ సిద్ధార్థ వర్మ, అనిల్ కుమార్‌తో కూడిన ధర్మాసనం ఈ ఆదేశాలను పాస్ చేసింది. ఎఫ్ఐఆర్‌ను సవాల్ చేస్తూ క్రికెటర్ దయాల్ పిటీషన్ దాఖలు చేశాడు. 27 ఏళ్ల క్రికెటర్‌పై జూలై ఆరో తేదీన పిటీషన్ నమోదు అయ్యింది. ఘజియాబాద్ జిల్లాలోని ఇందిరాపురం పోలీసు స్టేషన్‌లో కేసు రిజిస్టర్ చేశారు. భారతీయ న్యాయ సంహితలోని సెక్షన్ 69 (మోసపూరితంగా, లైంగికంగా వేధించడం) కింద కేసు బుక్ చేశారు.పెళ్లి చేసుకుంటానని చెప్పి ఓ మహిళను శృంగారపరంగా వాడుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఆ ఇద్దరూ అయిదేళ్ల క్రితం కలుసుకున్నారు. కానీ దయాల్ ప్రతిసారి పెళ్లిని వాయిదా వేస్తూ వచ్చారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆ క్రికెటర్ మరో అమ్మాయితో తిరుగుతున్నట్లు సదరు మహిళ ఫిర్యాదులో వెల్లడించింది. ముఖ్యమంత్రి ఆన్‌లైన్ గ్రీవియన్స్ పోర్టల్‌కు జూన్ 21వ తేదీన ఆమె ఫిర్యాదు అందింది.

# యూజర్లకు గుడ్‌న్యూస్.. త్వరలో కొత్త సపోర్ట్ చాట్ ఫీచర్‌ను తీసుకురానున్న వాట్సాప్



ఐఓఎస్ యూజర్లకు వాట్సాప్ మరో కొత్త ఫీచర్‌ను అందుబాటులోకి తీసుకువచ్చింది. స్పెషల్ సపోర్ట్ చాట్ ద్వారా ఏఐ యూజర్లు అడిగిన ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వనున్నది. ఈ కొత్త ఫీచర్ వాట్సాప్ యాప్ తాజా వెర్షన్‌లోకి రాగా.. రాబోయే వారాల్లో మిగతా యూజర్లందరికీ అందుబాటులోకి తీసుకురాబోతున్నది. ఈ సపోర్ట్ చాట్ కోసం మొదట వాట్సాప్ సెట్టింగ్‌లోకి వెళ్లాలి. అందులో హెల్ప్ బటన్‌పై క్లిక్ చేయాలి. అందులో హెల్ప్‌సెంటర్ బటన్‌పై క్లిక్ చేస్తే కాంటాక్ట్ అస్ పై క్లిక్ చేసి యాక్సెస్ చేయొచ్చు. దాంతో యూజర్లు అధికారిక వాట్సాప్ సపోర్ట్ ఖాతా అని సూచించే మెటా వేరిఫైడ్ బ్లూ టిక్‌తో కొత్త చాట్ విండో ఓపెన్ అవుతుంది.ఈ చాట్‌లో యూజర్లు అడిగే ప్రశ్నలన్నింటికీ సమాధానాలు ఇస్తుంది. ఈ సమాధానాలన్నీ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ మాత్రమే జనరేట్ చేస్తుంది. అయితే, ఈ సమాధానాల్లో కొన్ని తప్పు, లేదా అనుచిత సమాచారం ఉండవచ్చని నోటిఫికేషన్ వస్తుంది. ప్రతి సమాధానం కిందట ఇండికేటర్, టైమ్‌స్టాంప్ సైతం ఉంటుం ది. వినియోగదారులు తమ సమస్యలను నేరుగా టెక్స్ట్ ద్వారా, స్క్రీన్‌షాట్స్‌ల ద్వారా పంచుకోవచ్చు. రెస్పాన్స్ సైతం వేగంగా ఉంటుంది. ప్రతి చాట్‌కు ఒక సపోర్ట్ టికెట్ నెంబరు కూడా ఇస్తారు. ఈ ఫీచర్ తరచుగా అడిగే ప్రశ్నలకు సమాధానం ఇచ్చేందుకుసమాధానాలన్నీ ఆర్టిఫిషియల్ ప్రత్యేకంగా ఉపయోగపడుతుంది. వినియోగదారుడు మానవ సహాయం కోరితే.. సహాయక సిబ్బంది జోక్యం చేసుకుంటారని పేర్కొంటూ యూజర్లకు ఓ ఆటోమేటెడ్ సందేశం కనిపిస్తుంది.

# 9 పరుగులిచ్చి 6 వికెట్లు తీసిన మిచెల్ స్టార్క్



కింగ్‌స్టన్: వెస్టిండీస్‌తో జరిగిన మూడవ టెస్టులో ఆస్ట్రేలియా 176 రన్స్ తేడాతో గెలిచి సిరీస్‌ను 3-0 తేడాతో కైవసం చేసుకున్నది. రెండో ఇన్నింగ్స్‌లో వెస్టిండీస్ అత్యంత దారుణంగా విఫలమైంది. కేవలం 27 పరుగులకే ఆ జట్టు కుప్పకూలింది. ఆస్ట్రేలియా బౌలర్ మిచెల్ స్టార్క్ చెలరేగిపోయాడు. జమైకా పిచ్‌పై నిప్పులు చెరిగాడు. 9 పరుగులు ఇచ్చి ఆరు వికెట్లను తీసుకున్నాడు. మరో ఆసీస్ పేసర్ బోలాండ్ రెండో ఇన్నింగ్స్‌లో హ్యాట్రిక్ తీసుకున్నాడు. దీంతో టెస్టు క్రికెట్ చరిత్రలోనే వెస్టిండీస్ అత్యల్ప స్కోరుకు ఆలౌటైంది.టెస్టు క్రికెట్‌లో 1955 తర్వాత ఓ జట్టు అత్యల్ప స్కోరుకు నిష్క్రమించింది. గతంలో ఇంగ్లండ్ చేతిలో న్యూజిలాండ్ 26 పరుగులకే ఆలౌటైంది. 2004లో ఇంగ్లండ్ చేతిలో వెస్టిండీస్ 47 రన్స్‌కు ఆలౌటైంది. ఆ తర్వాత మళ్లీ సోమవారం జమైకాలో తక్కువ స్కోరుకు నిష్క్రమించింది. వందో టెస్టు ఆడుతున్న మిచెల్ స్టార్క్ తన స్పీడ్‌తో దుమ్మురేపాడు. 9 రన్స్ ఇచ్చి ఆరు వికెట్లు తీసుకున్నాడు. 15 బంతుల్లోనే అతను అయిదు వికెట్లు తీసుకున్నాడు. చాలా వేగంగా అయిదు వికెట్లను తీసేశాడు. టెస్టు క్రికెట్‌లో 400 వికెట్ల మార్క్‌ను కూడా అతను దాటేశాడు.సబినా పార్క్ మ్యాచ్‌లో ఆస్ట్రేలియా కేవలం 14.3 ఓవర్లలోనే వెస్టిండీస్‌ను ఆలౌట్ చేసింది. ఈ సిరీస్‌లో ఆస్ట్రేలియా పూర్తి ఆధిపత్యాన్ని ప్రదర్శించింది. బార్బడోస్‌లో జరిగిన మ్యాచ్‌లో 159 రన్స్ తేడాతో, గ్రెనిడాలో జరిగిన మ్యాచ్‌లో 133 రన్స్ తేడాతో నెగ్గింది. దీంతో ఫ్రాంక్ వొరెల్ ట్రోఫీని స్వీప్ చేసింది. ఈ మ్యాచ్‌లో స్టార్క్ హ్యాట్రిక్ మిస్సైనా.. అతని స్థానంలో బోలాండ్ ఆ ఫీట్ అందుకున్నాడు. టెస్టుల్లో హ్యాట్రిక్ తీసిన పదో ఆస్ట్రేలియా బౌలర్‌గా నిలిచాడతను.

# నాలుగు రోజుల నష్టాలకు బ్రేక్ 317 పాయింట్లు సెన్సెక్స్ జంప్.



దేశీయ స్టాక్ మార్కెట్‌లో నాలుగు రోజుల తర్వాత మార్కెట్లు లాభాల్లో ముగిశాయి. జూన్ నెలలో భారత దేశ ద్రవ్యోల్బణం 77 నెలల కనిష్ట స్థాయి 2.1శాతానికి తగ్గింది. ఈ క్రమంలో మార్కెట్‌లో అన్నిరంగాల్లో కొనుగోళ్లు కనిపించాయి. క్రితం సెషన్‌తో పోలిస్తే సెన్సెక్స్ 82,233.16 ఫ్లాట్‌గా మొదలైంది. ఈ తర్వాత కోలుకొని లాభాల్లోకి దూసుకెళ్లాయి. ఇంట్రాడేలో 82,221.74 పాయింట్ల కనిష్టానికి పెరిగిన సెన్సెక్స్.. గరిష్టంగా 82,743.62 పాయింట్లకు చేరింది. చివరకు సెన్సెక్స్ 317.45 పాయింట్లు పెరిగి 82,570.91 వద్ద ంది. ఇక నిఫ్టీ 113.50 పాయింట్లు పెరిగి 25,195.80 వద్ద ముగిసింది. అన్ని రంగాల సూచీలు ఫార్మా, ఆటో, మీడియా, పీఎస్‌యూ బ్యాంక్, కన్స్యూమర్ డ్యూరబుల్స్, రియాల్టీ 0.5-1 శాతం పెరిగాయి. బీఎస్ఈ మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ సూచీలు దాదాపు ఒకశాతం పెరిగాయి. హీరో మోటోకార్ప్, సన్ ఫార్మా, బజాజ్ ఆటో, అపోలో హాస్పిటల్స్, శ్రీరామ్ ఫైనాన్స్ నిఫ్టీలో ప్రధానంగా లాభాలను నమోదు చేశాయి.హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్, ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్, ఎటర్నల్, టాటా స్టీల్ నష్టపోయాయి. విస్తరణ ప్రణాళిక నేపథ్యంలో హీరో మోటోకార్ప్ షేర్లు 5 శాతం పెరిగాయి. ర్యాలీస్ ఇండియా షేర్లు 52 వారాల గరిష్టాన్ని తాకాయి. క్యూ 1లో లాభం దాదాపు రెట్టింపు అయిన విషయం తెలిసిందే. తేజస్ నెట్‌వర్క్స్ షేర్లు క్యూ 1లో నష్టాల నేపథ్యంలో షేర్లు 6 శాతం పడిపోయాయి. యూఎస్ పేటెంట్ సెటిల్‌మెంట్ లెక్సెల్వి ప్రారంభానికి మార్గం సుగమం కావడంతో సన్ ఫార్మా షేర్లు దాదాపు 3శాతం పెరిగాయి. ఈస్ట్ సెంట్రల్ రైల్వే నుంచి ఆర్డర్లతో రైల్‌టెల్ కార్పొరేషన్ షేర్లు 2 శాతం పెరిగాయి. టాటా టెక్నాలజీస్ షేర్లుమిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ సూచీలు జూన్ త్రైమాసికంలో నికర లాభం 5శాతం పెరగడంతో షేర్లు 2 శాతం పెరిగాయి. బీఎస్ ఈలో 140 స్టాక్‌లు 52 వారాల గరిష్ట స్థాయికి చేరాయి. ఇందులో ఆథమ్ ఇన్వెస్ట్‌మెంట్, నిప్పాన్ లైఫ్, హెచ్‌డీఎఫ్ ఏఎంసీ, గాడ్‌ఫ్రే ఫిలిప్స్, జిల్లెట్ ఇండియా, యూటీఐ ఏఎంసీ, పిరమల్ ఎంటర్‌ప్రైజెస్, అనుపమ్ రసాయనన్, లారస్ ల్యాబ్స్, ఈఐడీ ప్యారీ, గ్లోబల్ హెల్త్, సియట్, జేఎం ఫైనాన్షియల్ ఉన్నాయి.

# మూడో టెస్టులో ఓటమికి కారణాలేంటో చెప్పిన శుభ్‌మన్ గిల్ పంత్ గాయం, బుమ్రాపై కీలక అప్‌డేట్ ఇచ్చిన కెప్టెన్



భారత్-ఇంగ్లండ్ మధ్య జరుగుతున్న ఐదు మ్యాచుల టెస్ట్ సిరీస్‌లో లార్డ్స్ టెస్టులో ఆతిథ్య జట్టు 22 వరుగుల తేడాతో విజయం సాధించింది. ఈ విజయంతో ఇంగ్లండ్ 1-2 ఆధిక్యంలో నిలిచింది. ఈ మ్యాచ్ తర్వాత కెప్టెన్ శుభ్‌మన్ గిల్ ఓటమికి కారణాలు తెలిపాడు. చివరి రోజు విజయంపై తనకు నమ్మకం ఉందని.. అయితే, విజయానికి పెద్ద భాగస్వామ్యం నెలకొల్పాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డాడు. ఈ సందర్భంగా వైస్ కెప్టెన్ రిషబ్ పంత్ గాయంపై అప్‌డేట్ ఇచ్చాడు. గిల్ జట్టు ప్రదర్శనపై హర్షం వ్యక్తం చేశాడు. ప్రదర్శన చూస్తే చాలా గర్వగా ఉందని చెప్పుకొచ్చాడు. 'మ్యాచ్‌లో విజయం సాధిస్తామని చాలా నమ్మకంగా ఉన్నాం. ఎందుకంటే కీలకమైన బ్యాట్స్‌మెన్ ఉన్నారు. టాప్ ఆర్డర్‌లో కొన్ని మంచి భాగస్వామ్యాలు అవసరం. కానీ, మేం అలా చేయలేకపోయాం. మా కంటే ఇంగ్లండ్ మెరుగైన ప్రదర్శన ఇచ్చింది. లక్ష్యం పెద్దదేమీ కాదు. మ్యాచ్‌లో భాగస్వామ్యం కీలకం. రవీంద్ర జడేజా చాలా సీనియర్ ప్లేయర్. అతనికి ఎలాంటి సూచనలు ఇవ్వలేదు. అతను టెయిల్ ఎండ్ బ్యాట్స్‌మెన్ ఆడుతూనే ఉండాలని కోరుకున్నాడు' అంటూ చెప్పుకొచ్చాడు.రవీంద్ర జడేజా ఒంటరి పోరాటం..లార్డ్స్ టెస్టులో టీమిండియా లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో భారత్ 82 పరుగులకు ఏడు వికెట్లు కోల్పోయింది. కానీ, రవీంద్ర జడేజా 181 బంతులు ఎదుర్కొని నాలుగు ఫోర్లు, ఒక సిక్సర్ సహాయంతో 61 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. ఎనిమిదో వికెట్‌కు నితీశ్ రెడ్డి (13)తో కలిసి 91 బంతుల్లో 30 పరుగులు, జస్ప్రీత్ బుమ్రా (05)తో కలిసి తొమ్మిదో వికెట్‌కు 132 బంతుల్లో 35 పరుగులు, సిరాజ్‌తో కలిసి చివరి వికెట్‌కు 80 బంతుల్లో 23 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పి టీమిండియాకు విజయంపై ఆశలు రేకెత్తించాడు. కానీ, ఓ వైపు ఒంటరి పోరాటం చేసినా జట్టును ఓటమి నుంచి గట్టెక్కించలే కపోయాడు.పంత్, బుమ్రాపై కీలక అప్‌డేట్.. వైస్ కెప్టెన్ రిషబ్ పంత్ మాంచెస్టర్ టెస్టులో ఆడుతాడని గిల్ తెలిపాడు. స్కాన్‌లో పంత్ వేలికి ఎలాంటి పెద్ద గాయం కాలేదని తేలిం దని.. నాలుగో టెస్ట్ వరకు ఫిట్‌గా ఉంటాయని పేర్కొన్నారు. మూడో టెస్ట్ తొలి రోజు రెండవ సెషన్ లో పంత్ ఎడమ చూపుడు వేలుకు గాయం కావడంతో మైదానం విడిచి వెళ్లాల్సి వచ్చింది. గిల్ మాట్లాడుతూ పంత్ స్కానింగ్ కోసం వెళ్లాడు. అతనికి పెద్దగా గాయం కాలేదు. కాబట్టి మాంచెస్టర్ మ్యాచ్ వరకు సిద్ధమవుతాడని ఆశాభావం వ్యక్తం చేశాడు. నాలుగో టెస్ట్‌కు జస్ప్రీత్ బుమ్రా అందుబా టులో ఉంటాడాఅనిప్రశ్నించగా..సమాధానం ఇవ్వలేదు.

# ఢిల్లీలో టెస్లా రెండో షోరూం ఈ నెలాఖరులోనే ప్రారంభం



ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ చెందిన లగ్జరీ ఎలక్ట్రిక్ కార్ల తయారీ దిగ్గజం టెస్లా అధికారికంగా భారత విపణిలోకి అడుగుపెట్టిన విషయం తెలిసిందే. ఇవాళ ఉదయం ఆర్థిక రాజధాని ముంబైలో తొలి షోరూంను ప్రారంభించింది. ఇప్పుడు రెండో షోరూం ప్రారంభించేందుకు టెస్లా సిద్ధమైనట్లు తెలుస్తోంది. దేశ రాజధాని ఢిల్లీ లో తన సెకెండ్ షోరూంను తెరవనున్నట్లు సమాచారం.పరిశ్రమ వర్గాల సమాచారం ప్రకారం.. ఢిల్లీలోని ఇందిరా గాంధీ అంతర్జాతీ య విమానాశ్రయానికి సమీపంలో గల ఏరోసిటీ లో టెస్లా సెకెండ్ షోరూంను ప్రారంభిచనుంది. ఇందుకోసం వరల్డ్‌మార్క్ కాంప్లెక్స్‌లో 4,000 చదరపు అడుగుల స్థలాన్ని టెస్లా సంస్థ లీజుకు తీసుకున్నట్లు తెలిసింది. పార్కింగ్ సౌకర్యాలుగల ఈ షోరూమ్ స్పేస్‌కుగాను నెలకు రూ.25 లక్షలు అద్దె చెల్లించేలా కంపెనీ ప్రమోటర్, బిలియనీర్ ఎలాన్ మస్క్ డీల్ కుదుర్చుకున్నట్లు తెలిసింది. ఈ నెలాఖరులో ఢిల్లీ షోరూం కూడా ప్రారంభం కానున్నట్లు రియల్ ఎస్టేట్ వర్గాల సమాచారం.ముంబైలో టెస్లా తొలి షోరూం ప్రారంభంటెస్లా (భారత విపణిలోకి అడుగుపెట్టింది. ఇవాళ ఉదయం ముంబై నడిబొడ్డున బాంద్రా కుర్లా కాంప్లెక్స్ లోని మేకర్ మ్యాక్సిటీ మాల్‌లో టెస్లా తన తొలి షోరూంను గ్రాండ్‌గా లాంచ్ చేసింది. ఈ ఈవెంట్‌కు మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.4,000 చదరపు అడుగుల స్థలాన్ని టెస్లా సంస్థ లీజుకు తీసుకున్న విషయం తెలిసిందే. ఇక పార్కింగ్ సౌకర్యాలుగల ఈ షోరూమ్ స్పేస్‌కుగాను కంపెనీ ప్రమోటర్, బిలియనీర్ ఎలాన్ మస్క్ నెలకు రూ.35 లక్షల అద్దె చెల్లించనున్నారని తెలిసింది. అద్దె ఏడాదికి 5 శాతం పెంపు ప్రాతిపదికన ఐదేళ్ల కాలానికి యూనివ్‌కో ప్రాపర్టీస్ నుంచి లీజుకి తీసుకుంది. ఈ ప్రాపర్టీ గ్రౌండ్ ఫ్లోర్ దేశీయంగా ఏర్పాటైన తొలి యాపిల్ స్టోర్‌కు దగ్గరగా ఉంటుంది. రెంటల్ అగ్రిమెంట్ ఫిబ్రవరి 27న రిజిస్టరైంది. రూ.2.11 కోట్లు సెక్యూరిటీ డిపాజిట్‌గా కూడా టెస్లా జమ చేసినట్లు సమాచారం.మోడల్ కార్ల అమ్మకాలు.డాలర్లు (భారత కరెన్సీలో రూ.38.63 లక్షలు), చైనాలో 2,63,500 యువాన్ (రూ.31.57 లక్షలు), జర్మనీలో 45,970 యూరోలు (రూ.46.09 లక్షలు)గా ఉన్నాయి. వీటితో పోలిస్తే భారత్‌లోనే ఈ వై మోడల్ ధరలు అధికం కావడం గమనార్హం. దిగుమతి సుంకం, లాజిస్టిక్స్ ఖర్చులే ధర పెరుగుదలకు కారణంగా తెలుస్తోంది.

# లాస్ ఏంజిల్స్ ఒలింపిక్స్‌లో క్రికెట్ జూలై 20, 29 తేదీల్లో మెడల్ మ్యాచ్‌లు

లాస్ ఏంజిల్స్: 2028లో లాస్ ఏంజిల్స్‌లో జరిగే ఒలింపిక్స్ క్రీడల్లో క్రికెట్‌ను ప్రవేశపెట్టిన విషయం తెలిసిందే. అయితే ఆ మెగా ఈవెంట్‌కు చెందిన క్రికెట్ మ్యాచ్‌ల షెడ్యూల్‌ను ప్రకటించారు. లాస్ ఏంజిల్స్‌కు 50 కిలోమీటర్ల దూరంలో పామినా సిటీలో ఉన్న ఫెయిర్‌గ్రౌండ్స్ స్టేడియంలో తొలి మ్యాచ్ ఆడనున్నారు. 2028, జూలై 12వ తేదీన క్రికెట్ మ్యాచ్‌లు ప్రారంభంకానున్నాయి. జూలై 20, 29వ తేదీల్లో మెడల్ మ్యాచ్‌లు ఉంటాయని ఒలింపిక్స్ కమిటీ తెలిపింది. టీ20 ఫార్మాట్‌లో ఒలింపిక్స్ క్రికెట్ నిర్వహించనున్న విషయం తెలిసిందే.మహిళలు, పురుషుల విభాగాల్లో మొత్తం ఆరు జట్లు క్రికెట్ మెడల్ కోసం పోటీపడనున్నాయి. మొత్తం 180 మంది క్రికెటర్లు గేమ్స్‌కు రానున్నారు. 1900 సంవత్సరంలో జరిగిన ఒలింపిక్స్‌లో చివరిసారి క్రికెట్‌ను నిర్వహించారు. ఆ తర్వాత మళ్లీ ఎప్పుడూ ఒలింపిక్స్‌లో క్రికెట్‌కు స్థానం కల్పించలేదు. జూలై 14, 21 తేదీల్లో క్రికెట్ మ్యాచ్‌లు ఉండవు. 1900లో జరిగిన క్రికెట్ టోర్నీలో కేవలం రెండు జట్లు మాత్రమే పోటీపడ్డాయి. మెడల్ కోసం బ్రిటన్, ఫ్రాన్స్ పోటీపడ్డాయి. లాస్ ఏంజిల్స్‌లో పాల్గొనే 12 జట్లలో.. ఒక్కొక్క జట్టుకు 15 మంది సభ్యులను ఎంపిక చేసే అవకాశం కల్పించారు.

# చిన్న నగరాలకు ఐటీ కళ



దేశీయ ఐటీ పరిశ్రమ చూపు చిన్న నగరాలవైపు మళ్లింది. ఇన్నాళ్లూ బెంగళూరు, ఢిల్లీ-ఎన్‌సీఆర్ తదితర సంప్రదాయ ఐటీ హబ్‌లలోనే స్థిరపడుతూ వచ్చిన సాఫ్ట్‌వేర్ రంగం.. రూటు మార్చింది. వరంగల్, విశాఖపట్నం, కోయంబత్తూర్, ఉదయ్‌పూర్, నాగ్‌పూర్ వంటి ద్వితీయ, తృతీయ శ్రేణి పట్టణాల్లో తమ కార్యకలాపాలను ఐటీ కంపెనీలు విస్తరిస్తున్నాయి. ఈ క్రమంలోనే అక్కడ పనిచేసేందుకు ఉద్యోగులనూ పెద్ద ఎత్తున నియమించుకుంటూపోతున్నాయని ప్రముఖ హెచ్‌ఆర్ సేవల సంస్థ టీమ్‌లీజ్ చెప్తున్నది. జెనరేటివ్ ఏఐసహా ఇతర ఎమర్జింగ్ టెక్నాలజీల్లో మైసూరు నగరం ఆకర్షణీయంగా ఉందంటున్నది. ఈ నియామకాల్లో 32 శాతం ఇక్కడే జరిగాయన్నది.జోరుగా రిక్రూట్‌మెంట్స్ఈ ఏడాది జనవరి-జూన్‌లో దేశవ్యాప్తంగా ఉన్న టైర్-2, 3 నగరాల్లో ఐటీ నియామకాలు పుంజుకున్నాయి. టీమ్‌లీజ్ తాజా గణాంకాల ప్రకారం ఇక్కడ గతంతో పోల్చితే 50 శాతానికిపైగా వృద్ధి కనిపించడం గమనార్హం.



# అందుకే పుకార్లను నమ్మరాదు : నిధి అగర్వాల్

ఏపీ డిప్యూటీ సీఎం, పవర్ స్టార్ పవన్ కల్యాణ్ తాజా చిత్రం 'హరిహర వీరమల్లు' సినిమా రిలీజ్ డేట్ దగ్గర పడుతోంది. ఈ క్రమంలో, హీరోయిన్ నిధి అగర్వాల్ ప్రమోషన్లలో పాల్గొంటోంది. తాజాగా ఓ ఇంటర్వ్యూలో నిధి మాట్లాడుతూ ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. ఈ సినిమా షూటింగ్ చాలా టైమ్ తీసుకుందని కొందరు అంటున్నారని... పవన్ కల్యాణ్ పాలిటిక్స్ లో ఉంటూనే సినిమాకు చాలా సమయాన్ని కేటాయించారని చెప్పింది. ఆయన ఎంతో కష్టపడ్డారని తెలిపింది. మూవీకి అంత సీన్ లేదని, అందుకే లేట్ అవుతోందని కామెంట్స్ వచ్చాయని... ట్రైలర్ వచ్చాక వాటికి చెక్ పడిందని నిధి వ్యాఖ్యానించింది. సినిమా అద్భుతంగా ఉందనే కామెంట్లు ఇప్పుడు వస్తున్నాయని... అందుకే పుకార్లను నమ్మరాదని చెప్పింది. మరోవైపు ఈ సినిమా ప్రీరిలీజ్ ఈవెంట్ ఈ నెల 20న వైజాగ్ లో నిర్వహించనున్నారు.



# జూనియర్ ఎన్టీఆర్, త్రివిక్రమ్ శ్రీనివాస్ సినిమాపై కీలక అప్డేట్ ఇచ్చిన నాగవంశీ

ఎన్టీఆర్, త్రివిక్రమ్ శ్రీనివాస్ కాంబినేషన్లో ఓ పౌరాణిక చిత్రం రానున్న సంగతి తెలిసిందే. సితార ఎంటర్టైన్ మెంట్స్ బ్యానర్ లో నాగవంశీ ఈ సినిమాను భారీ రేంజ్ లో నిర్మించబోతున్నారు. ఈ సినిమాకు సంబంధించి నాగవంశీ కీలక అప్డేట్ ఇచ్చారు. సీనియర్ ఎన్టీఆర్ ను రాముడిగా, కృష్ణుడిగా చూసిన తనకు జూనియర్ ఎన్టీఆర్ ను దేవుడుగా చూపిస్తున్నాననే ఆనందం ఉందని నాగవంశీ తెలిపారు. ప్రస్తుతం ఈ సినిమా ప్రీప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయని వెల్లడించారు. వెంకటేశ్, త్రివిక్రమ్ సినిమా ఆగస్ట్ నుంచి ప్రారంభమవుతుందని... వచ్చే ఏడాది మధ్యలో తారక్ తో సినిమాను ప్రారంభిస్తామని తెలిపారు. విజయ్ దేవరకొండ ఏం మాట్లాడినా తప్పుగా అర్థం చేసుకుంటున్నారని నాగవంశీ అన్నారు. ఆయనను ప్రేక్షకులు ఎందుకు టార్గెట్ చేస్తున్నారో అర్థం కావడం లేదని చెప్పారు. మరోవైపు జూనియర్ ఎన్టీఆర్, హృతిక్ రోషన్ సినిమా 'వార్ 2' ఆగస్ట్ 14న ప్రేక్షకుల ముందుకు వస్తోంది. ఈ సినిమా గురించి నాగవంశీ మాట్లాడుతూ... ఈ చిత్రంలో తారక్ పరిచయ సన్నివేశం సినిమాకే హైలైట్ గా ఉంటుందని చెప్పారు. తారక్, హృతిక్ ల మధ్య ఫైటింగ్ సీన్ అద్భుతంగా ఉంటుందని... ఆ ఒక్క సీన్ చూసే తాను ఈ సినిమాను తెలుగులో రిలీజ్ చేయాలని నిర్ణయించుకున్నానని తెలిపారు. ఈ చిత్రంలో ఎన్టీఆర్ కేవలం కొన్ని నిమిషాలు మాత్రమే కనిపిస్తారనేది వదంతులు మాత్రమేనని... ఇద్దరికీ సమానమైన నిడివి ఉందని చెప్పారు

# రాజాసాబ్ ఎంట్రీ కోసం అదిరిపోయే ప్లాన్!

ప్రభాస్ నటిస్తున్న 'ది రాజాసాబ్' సినిమాపై మొదట్లో అంతగా అంచనాలు లేకపోయినా, ఇప్పుడు మాత్రం పరిస్థితి పూర్తిగా మారిపోయింది. ఇటీవల వచ్చిన టీజర్, ఫస్ట్ లుక్ పోస్టర్లు ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించాయి. ప్రభాస్ నయా లుక్‌కి ఫ్యాన్స్ ఫిదా అవుతున్నారు. మాస్, కామెడీ, హారర్ కలయికలో దర్శకుడు మారుతి తీస్తున్న ఈ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ పై ఇప్పుడు భారీ బజ్ ఏర్పడింది. ఇప్పటికే ప్రభాస్ కెరీర్‌లో వరుసగా భారీ పాన్ ఇండియా సినిమాలు ఉండగా, వీటన్నిటికీ భిన్నంగా 'ది రాజాసాబ్' డిఫరెంట్ హారర్ సినిమా కావడం విశేషం. ఇందులో నిధి అగర్వాల్, మాళవిక మోహనన్, రిధి కుమార్ కథానాయికలుగా నటిస్తున్నారు. బాలీవుడ్ స్టార్ సంజయ్ దత్ విలన్‌గా కనిపించనున్నారు. థమన్ సంగీతం అందిస్తుండగా, పీపుల్స్ మీడియా ఫ్యాక్టరీ భారీ బడ్జెట్‌తో నిర్మిస్తోంది. ఇక తాజా సమాచారం ప్రకారం, ప్రస్తుతం సినిమా షూటింగ్ హైదరాబాద్‌లోని రామోజీ ఫిల్మ్ సిటీలో శరవేగంగా జరుగుతోంది. ప్రభాస్‌పై ఓ కీలక సన్నివేశాన్ని చిత్రీకరిస్తున్నారు. ఈ సన్నివేశం సినిమాకు ముఖ్యమైన భాగమని సమాచారం. త్వరలోనే ప్రభాస్ ఇంట్రడక్షన్ సీన్ కోసం ప్రత్యేకంగా ఒక పాటను కూడా షూట్ చేయనున్నట్లు తెలుస్తోంది. ఈ పాటకు థమన్ ఓ అదిరిపోయే ట్యూన్ ఇచ్చాడట. అయితే, ఈ ఇంట్రడక్షన్ పాటలో ఓ హీరోయిన్ కూడా కనిపించనుందని టాక్. అంతా ఊహిస్తున్నట్లుగా కరీనా కపూర్, అలియా భట్‌లు మాత్రం ఈ పాటలో లేరట. మరి ఆ హీరోయిన్ ఎవరు? అనేది మాత్రం ఇంకా సస్పెన్స్‌గానే ఉంచారు. ఈ సీక్రెట్ బయటపడ్డాక సినిమాపై మరింత హైప్ ఏర్పడే అవకాశం ఉంది. దర్శకుడు మారుతి ప్రస్తుతం పూర్తిగా సినిమా మీదే ఫోకస్ పెట్టి, త్వరగా షూటింగ్ పూర్తి చేసి డిసెంబర్ 5న రిలీజ్ చేయాలని చూస్తున్నాడు. ఆల్రెడీ వాయిదాలు వచ్చిన నేపథ్యంలో ఈసారి జాప్యం లేకుండా పూర్తి చేయాలనే పట్టుదలతో ఉన్నాడు. విజువల్స్, కామెడీ, సాంగ్స్‌తో కలిపి ఓ ఫుల్ ఎంటర్‌టైనర్‌గా మలిచే ప్రయత్నం చేస్తున్నారు. మొత్తానికి, 'ది రాజాసాబ్' మొదటి సమయంలో అంచనాలు తక్కువగా ఉన్నా.. ఇప్పుడు మాత్రం అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్న మూవీగా మారిపోయింది. ప్రస్తుతం జరుగుతున్న షూటింగ్, కొత్త పాట వివరాలు సినిమాపై క్యూరియాసిటీని పెంచుతున్నాయి. ఒకవేళ ఈ సినిమా హిట్ అయితే.. సీక్వెల్ కూడా లైన్ లోకి వస్తుందని ముందే ఓ హింట్ అయితే ఇచ్చారు.



# నరసింహ నంది "ప్రభుత్వ సారాయి దుకాణం" ఫస్ట్ లుక్ విడుదల..!!

ప్రజావినికిడి,(హైదరాబాద్):
జాతీయ అవార్డ్ దర్శకులు నరసింహ నంది దర్శకత్వంలో వచ్చిన 1940లో ఒక గ్రామం,కమలతో నా ప్రయాణం,లజ్జా లాంటి ఉత్తమ విలువలు కలిగిన సినిమాల తరువాత నరసింహ నంది తాజాగా ఎస్వీఎస్ ప్రొడక్షన్స్,శ్రీనిధి సినిమాస్ సంయుక్తంగా నిర్మిస్తున్న ప్రభుత్వ సారాయి దుకాణం సినిమా ఫస్ట్ లుక్ విడుదల కార్యక్రమం గ్రాండ్ గా జరిగింది.ఈ కార్యక్రమంలో నిర్మాత ప్రసన్న కుమార్, దర్శకులు సముద్ర, నటుడు పృధ్వి తో పాటు చిత్ర యూనిట్ పాల్గొన్నారు.సెక్స్పియర్ కథలోని పాత్రల ఆధారంగా తీసుకొని తెలంగాణలో ఒక మారుమూల ప్రాంతంలో జరిగే పొలిటికల్ ఫ్యామిలీ ఇతివృత్తంగా పగ ద్వేషం,ఈర్ష, అసూయ,ప్రేమ మనిషిలోని వివిధ కోణాలను చూపిస్తూ ప్రభుత్వం సారాయి దుకాణం సినిమా కథను తయారు చెయ్యడం జరిగింది. 1980 నాటి పరిస్థితులు ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా మలచడం జరిగింది.ఈ సందర్భంగా దర్శకులు నరసింహ నంది మాట్లాడుతూ,మా ఈవెంట్ కు వచ్చిన ప్రసన్న కుమార్ కు కృతజ్ఞతలు, ప్రొడ్యూసర్ కౌన్సిల్ మెంబర్ గా అన్ని సమస్యలను సున్నితంగా పరిష్కరిస్తూ ఉంటారు. మల్లారెడ్డి పాత్ర చేసిన పృధ్వికి థాంక్స్,మా కార్యక్రమానికి విచ్చేసి మమ్మల్ని సపోర్ట్ చేస్తున్నందుకు వారికి అలాగే సముద్ర మమ్మల్ని విష్ చెయ్యడానికి వచ్చారు, వారికి ధన్యవాదాలు, నిర్మాతలు నరేష్ గౌడ, పరిగి మల్లిక్ ఈ సినిమాను చాలా ప్యాషన్ తో చేశారు. కమర్షియల్ అంశాలతో కూడుకున్న కథ ఇది,అన్ని వర్గాల ప్రేక్షకులు ఈ కథకు కనెక్ట్ అవుతారని తెలిపారు.

దర్శకుడు సముద్ర మాట్లాడుతూ,నేను నరసింహ నంది మంచి స్నేహితులము, ప్రతి సినిమా విభిన్నంగా చేస్తూ వచ్చారు.ప్రభుత్వ సారాయి దుకాణం మోషన్ పోస్టర్ చాలా బాగుంది,నిర్మాతలు పరిగి మల్లిక్,నరేష్ గౌడ సినిమా పట్ల చాలా సంతోషంగా ఉన్నారు,కెమెరామెన్ మోహన్,ఎడిటర్ నాగిరెడ్డి ఇలా అందరూ బాగా చేశారు.వారందరికీ ఈ సినిమా పెద్ద సక్సెస్ అవ్వాలని కోరుకుంటున్న అన్నారు.నిర్మాత ప్రసన్న కుమార్ మాట్లాడుతూ,నరసింహ నంది డైరెక్ట్ చేసిన 1940 లో ఒక గ్రామం సినిమాకు నేషనల్ అవార్డ్ రావడం విశేషం,తన దర్శకత్వంలో రాబోతున్న ప్రభుత్వ సారాయి దుకాణం సినిమాలో నటించిన నటీ నటులందరికి శుభాకాంక్షలు,ఈ చిత్ర యూనిట్ చాలా క్రమశిక్షణతో కనిపిస్తున్నారు. టాలెంట్ తో పాటు క్రమశిక్షణ చాలా అవసరం,ఈ సినిమా వీరందరికి మంచి పేరును తెచ్చి పెడుతుంది అనడంలో సందేహం లేదు,ఆర్టిస్ట్ గా కాకుండా గెస్ట్ గా వచ్చిన పృధ్వి ఈ సినిమా చాలా బాగుందని చెపుతున్నారు. తప్పకుండా ఆయన మాటలు నిజం కాబోతున్నాయని తెలిపారు.నటుడు పృధ్వి మాట్లాడుతూ,ఎస్వీఎస్ ప్రొడక్షన్స్ లో వస్తోన్న ప్రభుత్వ సారాయి దుకాణం సినిమా ను డైరెక్ట్ చేసిన నరసింహ నంది దర్శకత్వంలో నటించాలని ఎప్పటినుండో అనుకున్నాను. ఇప్పటికి నాకు ఇతని డైరెక్షన్ లో మంచి పాత్రలో నటించాను.ఎంతో మంది మంచి ఆర్టిస్ట్ లను పరిచయం చేసిన నరసింహ నంది ఈ సినిమాలో మరింతమంది కొత్త నటీనటులను పరిచయం చేసారు.ఈ సినిమాలో మా అమ్మాయి శ్రీలు చక్కటి రోల్ లో ఈ సినిమాలో నటించింది తనతో పాటు అందరికి ఈ సినిమా ఒక మంచి బ్రేక్ రావాలని కోరుకుంటున్నట్లు తెలిపారు.నిర్మాత నరేష్ గౌడ మాట్లాడుతూ,మమ్మలి ఆశీర్వదించడానికి వచ్చిన ప్రసన్న కుమార్,పృధ్వికి,సముద్ర కుకృతజ్ఞతలు,మా అన్న గురువు పరిగి మల్లిక్ తో కలిసి ఈ సినిమా నిర్మిచడం సంతోషంగా ఉంది, నరసింహ నంది సినిమాను చాలా అద్భుతంగా తెరకెక్కించారు రేపు అందరూ అదే ఫీల్ అవుతారు,త్వరలో మా ప్రభుత్వ సారాయి దుకాణం సినిమా థియేటర్స్ లో అందరిని అలరించబోతోందని తెలిపారు.నిర్మాత పరిగి మల్లిక్ మాట్లాడుతూ,

అతిథులకు మీడియా మిత్రులకు ఇక్కడికి విచ్చేసిన అందరికి కృతజ్ఞతలు,ప్రభుత్వ సారాయి దుకాణం సినిమా మా మూడేళ్ళ జర్నీ,ఎంతో కష్టపడి నాతో కలిసి నరేష్ గౌడ ఈ సినిమాను నిర్మించారు.నరసింహ నంది ప్రాణం పెట్టి ఈ సినిమాను తెరకెక్కించారు.అందరికి ఈ సినిమా కనెక్ట్ అవుతుంది. అందరూ ఆర్టిస్ట్ టెక్నీషియన్స్ ఈ సినిమా కోసం బెస్ట్ ఇచ్చారని తెలిపారు.

హీరో విక్రమ్ మాట్లాడుతూ,
ఆడిషన్స్ లో నన్ను సెలెక్ట్ చేసి నాకు అవకాశం ఇచ్చిన దర్శకులు నరసింహ నంది గారికి కృతజ్ఞతలు,ప్రభుత్వ సారాయి దుకాణం చిత్రం తప్పకుండా మీ అందరికి నచ్చుతుందని భావిస్తున్నాను అన్నారు.






హీరో సదన్ మాట్లాడుతూ,
ఈ సినిమా నా కెరీర్ లో ఒక మంచి సినిమాగా మిగిలిపోతుందని నమ్మకం ఉంది,ఒక సినిమాలో నటించానాన్న తృప్తి ఉందన్నారు.

హీరో వినయ్ మాట్లాడుతూ,
ప్రభుత్వ సారాయి దుకాణం సినిమా అందరిని ఎంటర్టైన్ చేస్తుందని నమ్ముతున్నాను.ఈ సినిమాలో నాకు అవకాశం ఇచ్చిన డైరెక్టర్ నరసింహ నంది నిర్మాతలు నరేష్ గౌడ గారికి పరిగి మల్లిక్ కు కృతజ్ఞతలు తెలిపారు.

హీరోయిన్ అధితి మైకేల్ మాట్లాడుతూ,
ప్రభుత్వ సారాయి దుకాణం సినిమాను డైరెక్టర్ నరసింహ నంది అద్భుతంగా తెరకెక్కించారు.ఈ సినిమా లో నటించినందుకు గర్వాంగా ఉంది. ఇలాంటి మంచి సినిమాలను ఆడియన్స్ ఆధరిస్తారన్న నమ్మకం ఉందన్నారు.

హీరోయిన్ శ్రీలు దాసరి మాట్లాడుతూ,
నరసింహ నంది దర్శకత్వంలో ప్రభుత్వ సారాయి దుకాణం సినిమాలో ఒక మంచి రోల్ లో నటించాను. తప్పకుండా నా పాత్ర మీ అందరికి నచ్చుతుందని భావిస్తున్నాను అన్నారు.

హీరోయిన్ మోహన సిద్ది మాట్లాడుతూ,
ఈ సినిమా లో నాకు అవకాశం ఇచ్చిన దర్శకుడు నరసింహ నంది గారికి కృతజ్ఞతలు.ఒక మంచి సినిమాలో నటించానన్న హ్యాపీ నెస్ ఉంది,త్వరలో రాబోతున్న ఈ సినిమా సక్సెస్ అవ్వాలని కోరుకుంటున్నా అన్నారు.

నటుడు తిలక్ మాట్లాడుతూ,
ఎన్నో సినిమాల్లో మంచి రోల్స్ లో నటించిన నాకు ఈ సినిమాలో మరో గుర్తిండిపోయే పాత్రలో నటించాను,ప్రభుత్వ సారాయి దుకాణం సినిమా ఆలోచింపజేసే విధంగా ఉంటుంది, డైరెక్టర్ నరసింహ నంది,నిర్మాతలు నరేష్,మల్లిక్ కు ఈ మూవీ పెద్ద విజయం సాధించాలని కోరుకుంటున్నట్లు తెలిపారు.

నటీనటులు: ఆర్.విక్రమ్,సదన్ హాసన్,వినయ్,నరేష్ రాజ్,అదితి మైకేల్, శ్రీలు దాసరి,మోహన సిద్ది,రంగరాజు, పృధ్వి,తిలక్,బాలు నాయక్,స్వప్న, జ్యోతి,బలగం సహాదేవ్,బలగం రమేష్ తదితరులు..

సాంకేతిక నిపుణులు:
బ్యానర్:ఎస్వీఎస్ ప్రొడక్షన్,శ్రీనిధి సినిమాస్
నిర్మాతలు:దైవ నరేష్ గౌడ, పరిగి స్రవంతి మల్లిక్
ఎడిటర్ :వి.నాగిరెడ్డి
సంగీతం:ఎస్ ఎస్
కెమెరామెన్: ఎస్.మురళి మోహన్ రెడ్డి
రచన,దర్శకత్వం: నరసింహ నంది

Printed , Published and Owned by Marepally Ashok , Printed at Dilip Offset Printers, H.NO. 4-110, Durga Nagar, Dilsukhnagar, Hyderabad , Ranga Reddy District -500060 and Published from H. No 18-353/1,Vijaya Nagar Colony, Hajipally Road, Farooq Nagar, Ranga Reddy District — 509216 Telangana State. Editor : Marepally Ashok, RNI.No :TELTEL/2023/85745. E mail id : ashok.laghs123@gmail.com. Cell. No: 8978701613